


రాష్ట్రవ్యాప్తంగా 1200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలతో వేల కుటుంబాలకు ఊరట లభించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు కూటమి నాయకులు, తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన సంస్కరణలు ప్రశంసనీయం.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ




శనివారం 14.02.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 298 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

# సంక్షేమం అభివృద్ధి సమతూకం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి అధికారంలోకి వచ్చాక సంక్షేమం- అభివృద్ధి సమతూకంగా సుపరిపాలన ప్రజలకు అందుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎన్నికల్లో వాగ్దానాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని గాడిలో పెట్టడంతో పాటు...అభివృద్ధి బాట పట్టించామని వెల్లడించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో భాగంగా అసెంబ్లీలో శుక్రవారం చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. గత 20 నెలలుగా కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. గత ప్రభుత్వ పాలన వల్ల కలిగిన ఇబ్బందులను ఎలా అధిగమించింది వెల్లడించారు. నాటి ప్రభుత్వం చేసిన దురాగతాలను ఎండగట్టారు. రాష్ట్రంలో అభివృద్ధి-సంక్షేమాన్ని అడ్డుకునేలా కొందరు కుట్రలు పన్నుతున్నారని సీఎం చంద్రబాబు శాసన సభలో అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."గత పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి పని చేశాయి. గత ప్రభుత్వ హయాంలో పాలకులు అసెంబ్లీలో అవమానించిన తీరుకు కన్నీళ్లు పెట్టుకున్నాను. 2019-24 మధ్య నాలాగే చాలా మంది కన్నీళ్లు పెట్టుకున్న పరిస్థితి. విశాఖ వెళ్తే పవన్ కల్యాణ్‌ను అడ్డుకున్నారు. గతంలో అరాచకాలు చేసిన వాళ్లు ఇప్పుడు నీతులు చెబుతున్నారు. ప్రజలు ప్రతీ అంశాన్నీ గమనిస్తూనే సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటారు. దాని ఫలితమే కూటమి అద్భుత విజయం. రాష్ట్రంలో జరిగిన విధ్వంసంపై అధికారంలోకి వస్తూనే 7 శ్వేత పత్రాలను విడుదల చేశాం. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని ఆదుకున్న కేంద్రానికి ధన్యవాదాలు. నెలకు రూ. 2,750 కోట్ల మేర ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌గా అందిస్తున్నాం. ఏడాదికి రూ. 33 వేల కోట్ల మేర నిధులు వెచ్చిస్తున్నాం.

మిగతా 2లో...



- 20 నెలల్లో ఎంతో చేశాం..భవిష్యత్తులో మరింత చేస్తాం
- రూ. లక్ష కోట్లతో ఉద్యాన హబ్ గా రాయలసీమ అభివృద్ధి
- గాడిలో విద్యుత్ వ్యవస్థ -తొలిసారిగా విద్యుత్ ఛార్జీల ట్రూడౌన్
- జనాభా నిర్వహణ కోసం ఈ సెషన్ లోనే పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ
- నల్లమల సాగర్ పై తెలంగాణ అభ్యంతరాలు ఎందుకు
- ఫ్యాక్షన్ మనస్తత్వంతోనే హెరిటేజ్ సంస్థపై ఆరోపణలు
- గత పాలనలో జరిగిన మద్యం స్కాంను సుప్రీం కోర్టు కూడా తప్పు పట్టింది
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

## హార్బర్ల ఆధునికీకరణ



- ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి
- ముత్యాలమ్మపాలెం మినీ జెట్టీపై సీఐసీఈఎఫ్ ప్రీ-ఫీజిబిలిటీ అధ్యయనం
- శాసనసభలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ప్రశ్నకు సమాధానం చెప్పిన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, సాగరమాల వంటి కేంద్ర పథకాల సహకారంతో రాష్ట్రంలోని ఫిషింగ్ హార్బర్లను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆధునీకరిస్తున్నామని వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో పెందుర్తి శాసన సభ్యులు పంచకర్ల రమేష్ బాబు పరవాడ మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామంలో మినీ జెట్టి / ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

మిగతా 3లో...

## మహిళల జోలికి వస్తే వదలం

- మాజీ మంత్రి అంబటి రాంబాబు ముఖ్యమంత్రి తల్లిని అవమానించారు
- ముఖ్యమంత్రి తల్లిని అవమానిస్తే వదిలిపెడతామా?
- ఒక తల్లిని అవమానిస్తూ మాట్లాడితే రెండు చిన్న మాటలు ఎలా అవుతాయి?
- సొంత తల్లిని, చెల్లిని గౌరవించే అలవాటు మీకు లేకపోవచ్చు, మాకు ఉన్నాయి
- శాసనమండలిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఫైర్
- శాంతిభద్రతలపై వైసీపీ ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రి లోకేష్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ మంత్రి అంబటి రాంబాబు ముఖ్యమంత్రి తల్లిని అవమానించారు. ముఖ్యమంత్రి తల్లిని అవమానిస్తే వదిలిపెడతామా అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ధ్వజమెత్తారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు అరెస్ట్, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయంటూ మండలి వైసీపీ పక్షనేత బొత్స సత్యనారాయణ, వైసీపీ ఎమ్మెల్సీ బొమ్ము ఇజ్రాయేల్ ఆరోపణలను మంత్రి లోకేష్ తిప్పికొట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మాజీ మంత్రి అంబటి రాంబాబు ముఖ్యమంత్రి తల్లిని అవమానించారు.

మిగతా 2లో...



## బీజేపీకి సిద్ధాంతమే శక్తి...

## శిక్షణే బలం

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడ భవానీపురంలోని ఎస్ కన్వెన్షన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన "పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్" రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు శుక్రవారం ఉత్సాహభరితంగా జరిగాయి. ఏడు గంటల పాటు సాగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

2లో...

కూటమి ప్రభుత్వంలో..

## ఆలయాల అభివృద్ధి, ధర్మ పరిరక్షణ



- పాలక మండళ్లు బాధ్యతగా ఉంటే ఆలయాల్లో అపచారాలు జరగవు
- గత పాలక మండలి బాధ్యతగా వ్యవహరిస్తే తిరుమలలో అపచారాలు జరిగేవి కాదు
- రాజకీయాలకు అతీతంగా దేవాలయాలను పరిరక్షించుకోవాలి
- శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ మార్గాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పాలక మండళ్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తే దేవాలయాల్లో అపచారాలు జరగవని, రాజకీయాలకు అతీతంగా దేవాలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత పాలక మండళ్లపై ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమలలోనే ఎన్నో అపచారాలు జరిగాయన్నారు. నాటి పాలక మండలి బాధ్యతగా వ్యవహరిస్తే తప్పులు జరిగేవి కాదని తెలిపారు.

మిగతా 2లో...

## 'నేషనల్ ట్రావెల్ మార్ట్'.. నూతన అధ్యయనానికి నాంది




- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- టూర్ ఆపరేటర్లే ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి బ్రాండ్ అంబాసిడర్లు అని మంత్రి దుర్గేష్ వెల్లడి
- గడిచిన 18 నెలల్లో రూ.20,088 కోట్ల పెట్టుబడులు, 1.22 లక్షల ఉద్యోగాల సృష్టి
- 'స్వర్ణాంధ్ర విజన్ 2047' దిశగా పర్యాటక రంగం పరుగులు పెడుతోందని వెల్లడి

3 లో

## 'పీఎం-రాహత్' ప్రారంభం

- రోడ్డు ప్రమాద బాధితులకు .. రూ.1.5 లక్షల నగదు రహిత చికిత్స

**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధానమంత్రి కార్యాలయం కొత్త భవనం సేవాతీర్థ్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు పథకాలకు ఆయన ఆమోదం తెలిపారు. అందులో 'పీఎం-రాహత్' ఒకటి . రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించే లక్ష్యంతో దీనిని తీసుకువచ్చారు. రూ. 1.5 లక్షల మేర నగదు రహిత చికిత్స అందనుంది. నిధుల కొరత కారణంగా ప్రాణాలు కోల్పోకుండా దీని ద్వారా కాపాడుకోవచ్చు.

మిగతా 2లో...



## వైసీపీ హయాంలో రాయలసీమకు అన్యాయం

- ఒక్క రూపాయి ఇవ్వకుండా గుండ్రేవులను గాలికొదిలేశారు: జగన్‌పై మంత్రి నిమ్మల ఫైర్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాయలసీమ బిడ్డ అని చెప్పుకుంటూ నాటి సీఎం జగన్ ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా గుండ్రేవులను గాలికొదిలేసారని మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. నేరడి, గుండ్రేవుల ప్రాజెక్టుల పురోగతిపై ఏపీ శాసన మండలి లో సభ్యులు అడిగన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. శ్రీకాకుళం జిల్లాలో వంశధార నది నుంచి 34 టిఎంసిల నీటిని వినియోగించుకునేలా నేరడి బ్యారెజీని రూపొందించడం జరిగిందని చెప్పారు.

మిగతా 2లో...



## కల్తీపై కఠిన చర్యలు

- రాష్ట్రంలో రూ. వంద కోట్లతో 5 ఫుడ్ సేఫ్టీ ల్యాబ్స్ ఏర్పాటు: మంత్రి సత్యకుమార్ యాదవ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆహార భద్రత, ప్రమాణాల చట్టంలోని నిబంధనల ప్రకారం నాసిరకం ఆహార పదార్థాల వాడకం, విక్రయాల నిరోధానికి ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. రాష్ట్ర శాసనసభలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుడు పార్థసారథి ఆహార పదార్థాలతయారీలో కల్తీ గురించి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు.

మిగతా 3లో...



## చేనేతలందరికీ ఉచిత విద్యుత్

- శాసనమండలిలో మంత్రి సవిత
- ఏప్రిల్ 1 నుంచి ఉచిత విద్యుత్ అమలు
- మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు
- మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్లు ఉచితం
- వైసీపీ ప్రభుత్వంలో ఆప్కో నిర్వీర్యం
- రూ.120 కోట్లు దారి మళ్లించిన గత ప్రభుత్వం
- చేనేత సహకార సంఘాల బకాయిలు చెల్లిస్తున్నాం
- ఆ సంఘాల నుంచి అవసరమైన మేరకు చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాం : మంత్రి సవిత

3 లో

## సోషల్ మీడియాను కట్టడి చేయాలి

- 16 ఏళ్ల లోపు చిన్నారులకు సోషల్‌మీడియా వాడకాన్ని నిషేధించాలి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** 16 ఏళ్ల లోపు చిన్నారులు సోషల్ మీడియా, సైబర్ నేరాల బారిన పడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్సీ నాగబాబు అన్నారు. శుక్రవారం ఆయన మండలిలో మాట్లాడుతూ.. 'సోషల్ మీడియా కట్టడికి ప్రత్యేక చట్టాలు రూపొందించాలి. చిన్నా, పెద్ద తేడా లేకుండా ప్రతీ ఒక్కరూ సోషల్ మీడియాకు ఆకర్షితులవుతున్నారు. పెద్దవాళ్ళకు చెడు ఏమిటి.? మంచి ఏమిటి.? అని ఆలోచించుకునే విచక్షణ ఉంటుంది. 16 ఏళ్ల లోపు చిన్నారులు మంచి ఏదో, చెడు ఏదో అర్థం చేసుకునే పరిస్థితుల్లో ఉండరు. ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, డెన్మార్క్, ఐరోపా దేశాల్లో 16 ఏళ్ల లోపు చిన్నారులకు సోషల్ మీడియా వాడకాన్ని నిషేధించారు.

మిగతా 2లో...

# మహిళల జోలికి వస్తే వదలం



(మొదటి పేజీ తరువాయి)

అవునా, కాదా సమాధానం చెప్పాలి. అంబటి రాంబాబు వినియోగించిన పదాలను ఒక్కసారి గమనించాలి. ముఖ్యమంత్రి తల్లిని అవమానిస్తే వదిలిపెడతామా? మహిళలను మనం గౌరవించాలి. ఆ బాధ్యత మనందరిపై ఉంది. హౌస్ లోపల, బయట మహిళలను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. మా సొంత కార్యకర్త వైఎస్ భారతీరెడ్డి గురించి మాట్లాడితే.. తక్షణమే చర్యలు తీసుకున్నాం. జైలుకు పంపించాం. మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి రెండు చిన్న మాటలు మాట్లాడారని చెబుతున్నారు. ఒక తల్లిని అవమానిస్తే చిన్న మాటలు ఎలా అవుతాయి? అలాంటి వ్యక్తిని సభ్యులు సమర్థిస్తే ఎలా? అధికార, ప్రతిపక్ష సభ్యులు ఎవరైనా మహిళలను కించపరిచే పదాలు వాడకూడదు. అలాంటివి పోత్సహించవద్దని కోరుతున్నా. మేం ఎలాంటి కక్ష సాధింపులకు పాల్పడటం లేదు.

**ఒక తల్లిని అవమానిస్తూ మాట్లాడితే రెండు చిన్న మాటలు ఎలా అవుతాయి?** : ఒక మహిళ గురించి మాట్లాడితే మేం ఎమోషనల్ అవుతాం. ఒక తల్లిని అవమానిస్తూ మాట్లాడితే రెండు చిన్న మాటలు ఎలా అవుతాయి? సొంత తల్లిని, చెల్లిని గౌరవించే అలవాటు మీకు లేకపోవచ్చు. మాకు ఉన్నాయి. మాకు బాధ్యత ఉంది. మహిళల జోలికి వెళితే వదిలిపెట్టేది లేదు. జగన్ రెడ్డి తల్లిగారైనా, ఎవరి తల్లైనా, చెల్లైనా, అక్కైనా.. ఎవరి గురించైనా మాట్లాడితే ప్రజాప్రభుత్వం వదిలిపెట్టే ప్రసక్తే లేదు. అది మా సీఎం, డిప్యూటీ సీఎం చెప్పారు. నెల్లూరులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే.. మా మహిళ ఎమ్మెల్యే గురించి ఏం మాట్లాడారో చూశాం. దానికి సమాధానం లేదు. అంబటి రాంబాబు విషయంలో జగన్ రెడ్డి వెళ్లి ప్రెస్ మీట్ లో సింపుల్ గా రెండు చిన్న మాటలు అన్నారని చెబుతాడు. అవి రెండు చిన్న మాటలా? ఒక తల్లిని అవమానిస్తే చిన్న మాటలా? నాయకత్వం వహిస్తున్న వ్యక్తి ఆ విధంగా మాట్లాడవచ్చా? టీడీపీ వారు ఎవరైనా మాట్లాడితే ఆధారాలు ఇవ్వండి, చర్యలు తీసుకుంటాం. టీడీపీ కార్యకర్త భారతీరెడ్డి గురించి చిన్న పోస్ట్ పెడితే చర్య తీసుకున్నాం. అదీ మా చిత్తశుద్ధి. ఐదేళ్లు మీరు ఏం చేశారు? మా పార్టీ కార్యాలయంపై దాడి చేస్తే ఏం చేశారు? సభలో మా తల్లిని అవమానిస్తే మీరు ఏం చేశారు? అంబటి రాంబాబు ఇచ్చిన స్టేట్ మెంట్ తప్పా, ఒప్పా.. మీరు తేల్చి చెప్పాలని మంత్రి లోకేష్ నిలదీశారు.

# 'పీఎం-రాహత్' ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో ఉచిత వైద్యం అందించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో దీనిని లాంచ్ చేశారు.

రోడ్డు ప్రమాద బాధితుడిని ఆసుపత్రికి తీసుకువచ్చిన వెంటనే వైద్య సేవలు ప్రారంభించాల్సి ఉంటుంది. ఒకవేళ తమవద్ద సౌకర్యాలు లేకపోతే వెంటనే మరో ఆసుపత్రికి పంపాల్సి ఉంటుంది. అందుకోసం సదరు ఆసుపత్రి వారే రవాణా సౌకర్యాలు కల్పించాలి. బాధితుడు డిశ్చార్జి అయిన తర్వాత వైద్య సేవలు అందించిన ఆసుపత్రి అందుకు సంబంధించిన బిల్లును ప్యాకేజీకి అనుగుణంగా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ప్రమాదం జరిగిన నాటి నుంచి ఏడు రోజుల వరకు ఈ సేవలు పొందొచ్చని గతంలో కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది.

మరోవైపు లక్‌పతీదీదీల సంఖ్యను మార్చి 2029 నాటికి రెట్టింపు చేసేలా కేంద్రం లక్ష్యం విధించుకుంది. ఇప్పటివరకు 3 కోట్లుగా ఉన్న టార్గెట్‌ను ఆరు కోట్లకు పెంచారు. వ్యవసాయ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు నిధులను రూ. 2 లక్షల కోట్లకు పెంచారు. దేశ స్టార్టప్ వ్యవస్థను వేగవంతం చేసేందుకు రూ. 10 వేల కోట్ల నిధులు కేటాయిస్తూ మోదీ సంతకాలు చేశారు.

# వైసీపీ హయాంలో రాయలసీమకు అన్యాయం



(మొదటి పేజీ తరువాయి)

నేరడి బ్యారేజీకి సంబందించి ఒడిశా రాష్ట్రంతో ఉన్న వివాదాన్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఒడిశా రాష్ట్రంతో వివాదాన్ని పరిష్కరించేలా ఇటీవలే సీఎం చంద్రబాబు కేంద్రజలశక్తి మంత్రిని కలిశారని గుర్తు చేశారు.

నెరడి బ్యారేజీ నిర్మాణాన్ని ప్రారంభించడానికి వీలుగా, ట్రిబ్యునల్ తీర్పును త్వరగా అధికారిక గెజిట్‌లో ప్రచురించేలా చర్యలు తీసుకోవాలని జలశక్తి మంత్రిని కోరామని చెప్పారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతాలకు, కేసీ కెనాల్‌కు, సాగు నీరందించేలా తుంగభద్ర నదిపై 20 టీఎంసీ ల నీటి నిల్వ సామర్థ్యంతో గుండ్రేవుల రిజర్వాయర్ ప్రతిపాదన పెట్టామన్నారు. గత టీడీపీ ప్రభుత్వం రూ. 2890 కోట్లతో గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చిందని తెలిపారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల సమ్మతి తీసుకునేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో ఈ ప్రాంత ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా చూసిన లోకేష్ కు ఈప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ ఉందన్నారు. రాయలసీమ కు సాగు, తాగు నీరందించే ప్రాజెక్టులను రద్దుచేసి, జగన్ సీమ ద్రోహిగా చరిత్రలో చిరస్థాయిగా మిగిలిపోయారని పేర్కొన్నారు. 2024 లో గుండ్రేవుల ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.. 4,530 కోట్లకు చేరుకుందని నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

# సోషల్ మీడియాను కట్టడి చేయాలి




(మొదటి పేజీ తరువాయి)

గతంలో బ్లూ వెల్స్ చాలెంజ్ కాన్సెప్ట్ లాంటి కార్యక్రమాలకు ఆకర్షితులై ఎంతోమంది చిన్నారులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలున్నాయి. మెమో చాలెంజ్, స్కల్ బ్రేకర్ చాలెంజ్, ఫైర్ చాలెంజ్ అంటూ ప్రాణాంతకమైన సాహసాలతో సోషల్ మీడియాలో చిన్నారులను ఆకర్షిస్తున్నారు. ఇలాంటి వాటికి ఆకర్షితులవుతున్న చిన్నారులు చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు.

మరి కొంతమంది చిన్నారులు అనేక ఒత్తిళ్లకు, మానసిక ఆందోళనకు గురవుతున్నారు. హోంశాఖ, ఐటీశాఖ, విద్యాశాఖ పరస్పర సమన్వయంతో సోషల్ మీడియా కట్టడి కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయం. విద్యార్థులకు విద్యా సంస్థల్లో అందిస్తున్న ట్యాబ్ లాంటి ఎలక్ట్రిక్ పరికరాల్లో కేవలం విద్యకు సంబంధించిన సమాచారం మాత్రమే వినియోగించుకునే విధంగా పరిమితం చేయాలి. విద్యార్థులకు అందించే ట్యాబుల్లో సోషల్ మీడియా వినియోగించకుండా పర్యవేక్షించే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఐటీ శాఖ, పోలీస్ శాఖ, విద్యాశాఖ సమన్వయంతో సోషల్ మీడియా అరాచలకు అడ్డుకట్ట వేయాలి. పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్స్ సమయంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. తమ పిల్లలు సోషల్ మీడియా నేరాలకు బలికాకుండా కాపాడుకునే విధానాలను వివరించాలి' అని నాగబాబు పేర్కొన్నారు.

# సంక్షేమం- అభివృద్ధి సమతూకం



(మొదటి పేజీ తరువాయి)

తల్లికి వందనం స్కీం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఆర్థిక సాయం అందించాం. స్త్రీశక్తి పథకం ద్వారా ఇప్పటి వరకూ 43.5 కోట్ల ప్రయాణాలు జరిగాయి. దీపం 2.0 ద్వారా ఏడాదికి 3 సిలెండర్లు ఉచితంగా మహిళలకు అందిస్తున్నాం. అన్నదాత సుఖీభవ ద్వారా రూ. 20 వేల రూపాయలు మూడు విడతల్లో రైతులకు అందిస్తున్నాం. అన్న క్యాంటీన్లను అన్ని నియోజకవర్గాల్లోనూ ఏర్పాటు చేస్తున్నాం. సమాజంలో ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారందరినీ ఆదుకునేలా సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నాం. పీ4 ద్వారా భవిష్యత్‌లో మంచి ఫలితాలు వస్తాయి. సంపద ఉంటేనే ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయగలం... సంపద పంచగలం. అందుకే జీరో పావర్టీ ద్వారా పేదరిక నిర్మూలన కార్యక్రమాన్ని రాష్ట్రంలో చేపట్టాం. అట్టడుగు స్థాయిలో ఉన్న వారికి చేయూత అందించేందుకు పీ4 కార్యక్రమం. పేదరిక నిర్మూలనకు సంబంధించి దేశంలోనే ఇది అత్యుత్తమ మోడల్."అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**పీపీపీతోనే ప్రగతి... పురోగతి** : "పీపీపీ వల్ల సంపద సృష్టి జరుగుతోంది. రోడ్లు, పోర్టులు, ఎయిర్ పోర్టులు ఈ విధానంలోనే నిర్మితం అవుతున్నాయి. పీపీపీ విధానంలో ప్రాజెక్టు నిర్మించి నిర్వహిస్తారు. నిర్దిష్టకాలపరిమితి తర్వాత ప్రభుత్వానికి అప్పగిస్తారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. క్వాంటం నైపుణ్యాల కోసం కోర్సు నిర్వహిస్తుంటే 60 వేల మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రస్తుతం ఇంధన రంగంలో ట్రాన్సిషన్ సమయం నడుస్తోంది. హరిత ఇంధనానికి డిమాండ్ ఉంది. గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి సంబంధించి ఏపీ, మహారాష్ట్ర ఓ మోడల్ అవుతాయి. ఏపీలో ప్రొజ్యూమర్ విధానంలో ఇంధన ఉత్పత్తి చేయాలని భావిస్తున్నాం. సోలార్ ప్యానళ్లను ఇళ్లపై ఏర్పాటు చేసుకుని గ్రిడ్ కు అనుసంధానిస్తాం. సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజారోగ్య సేవలను విస్తృతం చేస్తాం. ఈ నెల 16 తేదీన బిల్ గేట్స్ రాష్ట్రానికి వస్తున్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో డిజిటల్ హెల్త్ రికార్డులను తయారు చేసి వ్యక్తిగత ఔషధాలను కూడా అందించే అవకాశం ఉంది. సంజీవని ప్రాజెక్టుపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలి. జనాభా నిర్వహణపై ఈ అసెంబ్లీ సెషన్లోనే పాలసీ తెస్తాం. డెమో గ్రాఫిక్ డివిడెండ్ ను సమర్ధంగా వినియోగించుకోవడం ద్వారా సంపద సృష్టించేందుకు అవకాశం ఉంటుంది. మెగా డీఎస్సీ హామీ ఇచ్చి ఏడాది లోగానే టీచర్లకు పోస్టింగులు ఇచ్చాం. కానిస్టేబుళ్ల నియామకాలు కూడా పూర్తి చేసి స్టైఫండ్ ను రూ. 4,500 నుంచి రూ. 12,500కు పెంచాం. భూమి ఇవ్వకుండా, ప్రోత్సాహకాలు ఇవ్వకుండా పరిశ్రమలు, ఉద్యోగాలు ఎలా వస్తాయి...? ప్రముఖ పరిశ్రమలకు భూములు ఇస్తుంటే కొందరు వివాదం చేసే ప్రయత్నం చేస్తున్నారు. పరిశ్రమలను ప్రోత్సహించేలా ఎస్క్రో ఖాతా ఏర్పాటు చేస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తో వేగంగా అనుమతులు ఇస్తున్నాం. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25.6 శాతం ఏపీకే వచ్చాయంటే ఏపీ బ్రాండ్ విలువ ఏమిటో అందరూ అర్ధం చేసుకోవాలి. గత పాలకుల వేధింపుల కారణంగా అమర్ రాజా బ్యాటరీస్ పొరుగు రాష్ట్రానికి వెళ్లిపోయింది. విశాఖలో గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ పరిశ్రమలు వస్తున్నాయి. అనకాపల్లిలో ఆర్సెల్లార్ మిట్టల్ కూడా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నాయి. రామాయపట్నం వద్ద బీపీసీఎల్ కూడా రూ. 70 వేల కోట్లతో రిఫైనరీని ఏర్పాటు చేస్తోంది. భాగస్వామ్య సదస్సులో రూ. 13.5 లక్షల కోట్ల పెట్టుబడులు 610 ఎంఓయులు చేసుకున్నాం. మొత్తంగా రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 23 లక్షల ఉద్యోగాలు వస్తాయి. 20 లక్షల ఉద్యోగాలను ఐదేళ్లలో ఇస్తామన్న హామీని నిలబెట్టు కుంటాం."అని సీఎం స్పష్టం చేశారు.

**24 గంటల్లో ధాన్యం కొనుగోళ్లకు చెల్లింపులు జరుపుతున్నాం...** : "గత పాలకులు సమర్ధంగా నీటి నిర్వహణ చేపట్టలేదు. ఎన్టీఆర్ హంద్రీనీవా, గాలేరు-నగరి, తెలుగు గంగ లాంటి ప్రాజెక్టులతో రాయలసీమలో ప్రాజెక్టులు చేపట్టారు. వచ్చే మూడేళ్లలో ఉత్తరాంధ్రలోని అన్నిప్రాజెక్టులనూ పూర్తి చేస్తాం. పోలవరం-వంశధారను లింక్ చేస్తాం. ఎడమ కాలువ ద్వారా ఈ ఏడాది అనకాపల్లి వరకూ నీటిని తీసుకెళ్తాం. హంద్రీనీవా కాలువలను పూర్తి చేసి కుప్పం వరకూ నీళ్లు తీసుకువెళ్లాం. చెరువులు నింపాం. రాయచోటికి కూడా నీరు తీసుకెళ్తాం. గాలేరు నగరి ద్వారా వచ్చే ఏడాది కడపకూ నీళ్లు పారిస్తాం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎమ్మెల్యేలు కూడా ప్రత్యక్షంగా చూడాలని కోరుతున్నాను. గత పాలకులు రాజకీయ కక్షతో పోలవరాన్ని గోదాట్లో ముంచేశారు. డయాఫ్రం వాల్ ధ్వంసం చేశారు. ఇప్పుడు రూ. 1000 కోట్లతో మళ్లీ డయాఫ్రం వాల్ నిర్మిస్తున్నాం. పోలవరం ప్రాజెక్టును 2027 జూన్ నెలలోగా జాతికి అంకితం చేస్తాం. ఏటా 3500 టీఎంసీల గోదావరి వరద జలాలు సముద్రంలోకి వృధాగా పోతున్నాయి. అందులో 200 టీఎంసీల నీటిని నల్లమల సాగర్ కు తరలిస్తాం. ఈ ప్రాజెక్టుకు తెలంగాణా అభ్యంతరం చెప్పటం సరికాదు. తెలుగు జాతిగా రెండు రాష్ట్రాలూ నీటిని సద్వినియోగం చేసుకోవాలి. అవసరమైతే ఈ అంశాన్ని సంప్రదింపుల ద్వారా ఓ నిర్ణయానికి రావచ్చు. ఒకటి రెండు అంశాలు పరిష్కారం అయితే కూర్చుని మాట్లాడు కుందామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ప్రతిపాదించారు. నల్లమల సాగర్ ప్రాజెక్టుకు అడ్డుపడటం సరికాదు. రూ. 1 లక్ష కోట్లతో రాయలసీమను ఉద్యాన హబ్ గా తయారు చేస్తాం. రూ. 30 వేల కోట్ల మేర ప్రభుత్వ నిధులు... రూ. 70 వేల కోట్లు ప్రైవేటు పెట్టుబడులతో సీమలో హార్టీకల్చర్ అభివృద్ధి చేస్తాం. ప్రస్తుతం ఏడాదికి 400 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా పండ్ల ఉత్పత్తి జరుగుతోంది. భవిష్యత్తులో 1000 లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యాన ఉత్పత్తులకు కేంద్ర స్థానంగా రాయలసీమ ఎదుగుతుంది. అక్వా కల్చర్ గత పాలనలో ఒడిదుడుకులు ఎదుర్కొంది. రూ. 1.50 యూనిట్ చొప్పున విద్యుత్ ను ఆక్వాకు ఇస్తున్నాం. ప్రపంచంలోనే అత్యుత్తమ ఆక్వా కల్చర్ హబ్ గా మన ప్రాంతం తయారవుతుంది. ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లో డబ్బులు చెల్లించింది కూడా కూటమి ప్రభుత్వమే. కోకోనట్, కోకో, కాఫీ లాంటి పంటలపై కేంద్రం దృష్టి సారించింది. దీనిపై మరింత శ్రద్ధ పెట్టి వ్యాల్యూ ఎడిషన్ చేసేలా చర్యలు తీసుకుంటాం. ఏపీలో రైతుల ఆత్మహత్యలను నివారించేలా చర్యలు చేపడుతున్నాం. ప్రతీ ఘటననూ ఆడిట్ చేయిస్తాం. విద్యార్థులు కూడా ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు ఎదుర్కోవాలి. ఆత్మహత్యలు దేనికీ పరిష్కారం కాదు."అని సీఎం చెప్పారు.

**హెలిపాడ్ కోసం భూమి ఇవ్వలేదని వివాదంలోకి నెట్టేశారు...** : "లాజిస్టిక్స్ రంగంలో పెనుమార్పులు సాధించేలా నిర్ణయం తీసుకుంటున్నాం. రైల్వే రంగంలో రూ. 3 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు చేపట్టేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. రెండేళ్లలో ఇచ్ఛాపురం నుంచి దిగువ వరకూ నాలుగు లేన్ల ట్రాక్ వచ్చే అవకాశం ఉంది. తద్వారా కార్గో, ప్రయాణికుల మార్గాలు విస్తృతం అవుతాయి. జాతీయ రహదారులు కూడా పెద్దఎత్తున నిర్మించేలా కేంద్రం ప్రాజెక్టులు ప్రతిపాదించింది. డబుల్ ఇంజన్ సర్కారులో త్రిబుల్ ఫలితాలు వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులను రూ. 4 వేల కోట్లతో అనుసంధానిస్తున్నారు. విద్యుత్ రంగాన్ని గత పాలకులు విధ్వంసం చేశారు. గత పాలకులు రూ. 32,166 కోట్ల భారాన్ని వినియోగదారులపై మోపారు. గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల విద్యుత్ వాడకుండానే సోలార్, విండ్ ప్రాజెక్టుల్లో రూ. 9 వేల కోట్లు కట్టాల్సి వచ్చింది. ఫ్యూయల్ సర్చార్జి భారం రూ. 12,617 కోట్ల మేర వేశారు. మొత్తంగా రూ. 1,22,422 కోట్లను గత ప్రభుత్వం విద్యుత్ బకాయిలు పెట్టి పోయింది. 78 నుంచి 90 శాతం మేర కరెంటు ఛార్జీల భారం ప్రజలపై వేశారు. మేం విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పాం దానికి కట్టుబడి ఉన్నాం. రూ. 4,860 కోట్ల ట్రూ అప్ భారాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. వచ్చే మూడేళ్ల లోనూ విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇస్తున్నాం. గత పాలనలో ల్యాండ్ రికార్డులన్నీ అస్తవ్యస్తం చేసేశారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భూ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులే మాకు అందాయి. అడిగిన భూములు ఇవ్వకపోతే వాటిని 22ఏలో పెట్టేశారు. చట్టాలు చేసిన ముఖ్యమంత్రే నాడు చట్టవ్యతిరేక కార్యక్రమాలు పాల్పడ్డారు. బాధితులు ఇంక ఎవరికి చెప్పుకుంటారు...? తాడేపల్లి ప్యాలెస్ సమీపంలో హెలిప్యాడ్ కట్టడం కోసం ఓ భూమి అడిగారు. ఆ భూమి ఇవ్వకపోతే బలవంతంగా 22ఏలో పెట్టేశారు. గత పాలకులు రూ. 33 లక్షలతో హెలిపాడ్, అప్రోచ్ రోడ్ నిర్మాణం కోసం జీవో ఇచ్చేశారు. మదనపల్లిలోని ఆర్డీఓ ఆఫీసులో రెవెన్యూ రికార్డులు తగులబెట్టారు. వాళ్లు చేసిన పాపం కడగడానికే ఏడాది సమయం పట్టింది. 2026లో ఈ రెవెన్యూ రికార్డులన్నీ ప్రక్షాళన చేసి రాజ ముద్రతో పాస్ పుస్తకాలు జారీ చేస్తాం. ప్రతీ ఒక్కరి భూమికి భద్రత ఇచ్చేలా కార్యాచరణ చేపడుతున్నాం. గత పాలకులు ఇసుకను కూడా దోపిడీ చేశారు. దానిని పరిష్కరిస్తూ ఉచిత ఇసుక పాలసీని పటిష్టంగా అమలు చేస్తున్నాం. మద్యం వ్యవహారంలోనూ ప్రజల ప్రాణాలను పణంగా పెట్టారు. రూ. 3200 కోట్ల మేర మద్యం కుంభకోణానికి పాల్పడ్డారు. ఏపీలో గత పాలనలో జరిగిన మద్యం స్కాంపై కోర్టులు కూడా సీరియస్ అయిన పరిస్థితి. మెరుగైన మద్యం పాలసీ తెచ్చాం. హోలోగ్రామ్, బ్యాచ్ నెంబర్ సహ భద్రతా ఫీచర్లతో ఎక్కడా నకిలీకి ఆస్కారం లేకుండా చేస్తున్నాం." అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

**వాళ్ల పాపాల బురదను వేరే వారికి అంటిస్తారు** : "శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేదు. రాజకీయ ముసుగులో కొందరు నేరాలకు పాల్పడుతున్నారు. తిరుపతి లడ్డూ వ్యవహారం చాలా సున్నితమైన అంశం. కొందరు కావాలని దేవుడి పవిత్రతను, భక్తుల మనోభావాలు దెబ్బతీయాలని ప్రయత్నించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులు ఒక్కసారైనా శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించు కోవటం ఆనవాయితీ. జరిగిన తప్పులను చెప్పక పోతే అక్రమార్కులు తప్పే జరగలేదని బుకాయిస్తారు. టీటీడీ సహా అన్ని దేవాలయాల్లో పవిత్రతను కాపాడేందుకు కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుంది. కల్తీ నెయ్యి సరఫరా చేసిందే కాక.. ఆ వివాదంలోకి హెరిటేజ్ సంస్థను తీసుకు వచ్చారు. వివేకా హత్య కేసు ఘటనలో ఎన్ని నాటకాలు ఆడారు. సాక్షి పత్రికలో నారాసుర రక్త చరిత్ర అని రాశారు. వాళ్లు చేసిన నేరాన్ని తప్పించుకోవడానికి ఇతరులపై నెట్టేసే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారాన్ని హెరిటేజ్ సంస్థకు ముడి పెట్టి ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారు. హెరిటేజ్ అనేది ఫ్యామిలీ బిజినెస్. లైవ్ లీ హుడ్ కింద వ్యాపారం చేస్తున్నారు. బ్రాండ్ దెబ్బతీసేలా ఆ పత్రికలో అవాస్తవ కథనాలు ప్రచురిస్తున్నారు. గతంలో రాయలసీమ ఫ్యాక్షన్లో భాగంగా కక్ష తీర్చుకునేందుకు చీనీ చెట్లను నరికి వేసేవారు. ప్రత్యర్థులను ఆర్థికంగా దెబ్బ తీ-యాలనేది ఫ్యాక్షనిస్టులకు అలవాటు. దాంతో ప్రత్యర్థులు తీవ్రంగా నష్ట పోయే పరిస్థితి. ఇప్పుడు ఇలాంటి వ్యవహారాన్నే వాళ్లు నడిపిస్తున్నారు. 2047 స్వర్ణాంధ్ర విజన్ ద్వారా ఏపీని అగ్రస్థానంలో నిలిపేలా ప్రణాళికలు చేశాం. పది సూత్రాల ద్వారా ఈ విజన్ ను సాధించేందుకు లక్ష్యాలు నిర్దేశించుకున్నాం. 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఏపీని తీర్చిదిద్దుతాం. 2047కు భారత్ నెంబర్ వన్ ఎకానమీగా ఉంటుంది. అందులో ఏపీ అగ్రస్థానానికి చేరుతుంది. అత్యధిక తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు ఉండాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. హెల్తీ, వెల్తీ హ్యాపీ ఏపీ అనే విధానం మాది. 2019-24 మధ్య ఏం జరిగిందో అంతా చూశాం. ప్రతీ ఐదేళ్లకూ తలసరి ఆదాయం రెట్టింపు అయ్యేలా ప్రణాళికలు చేపడుతున్నాం. మంత్రులు, ఎమ్మెల్యేలు అంతా ఈ అంశాలపై దృష్టి సారించాలి. పాలసీలు కూడా నిరంతరం సమీక్షించుకుంటూ ముందుకు సాగుదాం. ఈ రెండేళ్లలో సాధించిన విజయాలు మననం చేసుకుంటూ మరింత ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుందాం. 11 సంఖ్యతో వైసీపీకి అవినాభావ సంబంధం ఉందని అనుకుంటున్నాను. అందుకే గవర్నర్ ప్రసంగిస్తుండగా సభలో అడ్డంకులు సృష్టించి వచ్చిన 11 నిమిషాలకు బయటకు వెళ్లిపోయారు."అని ముఖ్యమంత్రి అన్నారు.

# బీజేపీకి సిద్ధాంతమే శక్తి... శిక్షణే బలం





(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, శిక్షణ ద్వారానే పార్టీ బలోపేతం సాధ్యమవుతుందని అన్నారు. కార్యకర్తల ద్వారా సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలంగా నిలబెట్టడమే లక్ష్యమని చెప్పారు. ఏకాత్మమానవతా దర్శనం పార్టీ మూల సిద్ధాంతమని, దానిపై ప్రతి కార్యకర్తకు స్పష్టమైన అవగాహన ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

వేదికపై జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివ ప్రకాష్, దక్షిణాది రాష్ట్రాల ప్రశిక్షణ మహాభియాన్ ఇంచార్జి కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ చేపడుతున్న కార్యక్రమాలను కాసం వెంకటేశ్వర్లు ప్రశంసించారు. డీ నోటిఫైడ్ ట్రైబ్స్, విశ్వకర్మలు, నాదస్వరం కళాకారుల సమస్యలపై పార్టీ చేసిన సేవలను గుర్తుచేశారు. శిక్షణపై ఆయన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాల రూపరేఖను సన్నారెడ్డి దయాకర్ రెడ్డి వివరించారు. టెక్నాలజీ వినియోగంతో ప్రజలకు చేరువయ్యే మార్గాలపై ఐటీ సెల్ రాష్ట్ర ఇంచార్జి శివ మకుటం ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం జోన్‌ల వారీగా సమావేశాలు నిర్వహించి మండల స్థాయి శిక్షణ అమలుపై చర్చించారు.

ముగింపు సమావేశంలో శివ ప్రకాష్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా పార్టీకి సుమారు 14 కోట్ల మంది సభ్యులు, 11 లక్షల బూత్ కమిటీలు, 17,700 మండల కమిటీలు ఉన్నాయని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ అయినప్పటికీ, సంఖ్యతో పాటు కార్యకర్తల నాణ్యత కూడా అత్యంత అవసరమని అన్నారు. వస్త్రం నేసేటప్పుడు నిలువు-అడ్డ దారాలు సరిగా ఉన్నప్పుడే నాణ్యత వస్తుందన్న తానా--బానా సూత్రాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రి సత్య కుమార్ యాదవ్, బీజేపీ శాసనసభ పక్ష నేత విష్ణు కుమార్ రాజు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, డాక్టర్ పార్థసారథి, ఎన్. ఈశ్వర రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నాగోతు రమేష్ నాయుడు, మట్టా ప్రసాద్, సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్న, ఒబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిషీధా రాజు, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా, యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ కుమార్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో.. ఆలయాల అభివృద్ధి, ధర్మ పరిరక్షణ



(మొదటి పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఆలయ పాలక మండళ్లు గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు, అపచారాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నూతనంగా నిర్మించిన శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ రోడ్డును వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి వర్చువల్‌గా శుక్రవారం ఉదయం ప్రారంభించారు. సుమారు రూ. 10 కోట్ల అంచనా వ్యయంతో గిరి ప్రదక్షణ రోడ్డును నిర్మించారు. రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, దేవాదాయ శాఖ కార్యదర్శి డాక్టర్ హరి జవహర్ లాల్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "మన ఆలయాలు నాగరికతకు చిహ్నాలు. మన కళలు, మన వారసత్వం, మన సంస్కృతి, ధర్మ పరిరక్షణ ఆలయాలతో ముడిపడి ఉన్నాయి. అరుణాచలంలో గిరిప్రదక్షణ చేస్తారు అని తెలుసు. నాకు గిరిప్రదక్షణ చేయాలని చాలా కోరిక ఉంది. దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆహ్వానం మేరకు, భక్తుల కోరిక మేరకు త్వరలో శ్రీకాళహస్తి క్షేత్రాన్ని సందర్శించి కచ్చితంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటాను. శివరాత్రికి రెండు రోజుల ముందు ఈ శ్రీకాళహస్తి గిరి ప్రదక్షణ మార్గాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉంది. గత ప్రభుత్వం ఆలయాల పరిరక్షణ అంశాన్ని చాలా నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దేవాదాయ మంత్రిగా రామనారాయణ రెడ్డి బాధ్యతలు స్వీకరించాక ఆలయాల పరిరక్షణను ఎంతో బాధ్యతగా ముందుకు తీసుకువెళు తున్నాం. నిరాదరణకు గురైన ఎన్నో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నారు. భక్తులు కోరుకుంటే ఏజెన్సీలో కూడా ఆలయాలు నిర్మించాలన్న ఆయన గొప్ప సంకల్పానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

**శివరాత్రి తర్వాత గిరిప్రదక్షణ మార్గంలో మొక్కలు నాటుతాం** : శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ మార్గంలో ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రూ. 10 కోట్లు వెచ్చించి సిమెంటు రోడ్డు నిర్మించాం. 22 కిలోమీటర్ల గిరి ప్రదక్షణ మార్గాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. అటవీ శాఖ ఆధ్వర్యంలో గిరిప్రదక్షణ మార్గానికి ఇరు వైపులా మొక్కలు నాటే కార్యక్రమానికి శివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం శ్రీకారం చుట్టబోతున్నాం. శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ ద్వారా ప్రతి భక్తుడికి కైలాసగిరి ప్రదక్షణ చేసిన పుణ్యఫలం దక్కాలని ఈ సందర్భంగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

**రూ. 40 కోట్లతో 22 ప్రధాన ఆలయాలకు రోడ్లు** : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మార్గ నిర్దేశకత్వంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతి అడుగులో మన సనాతన ధర్మ ఔన్నత్యాన్ని పరిరక్షించేందుకు కృషి చేస్తూ.. ఆలయాలు, ఆలయాలకు వెళ్లే రోడ్లను అభివృద్ధి చేస్తున్నాం. ఆ ప్రక్రియలో భాగంగా దేవాదాయశాఖ సహకారంతో ఏలూరు జిల్లా ఐ.ఎస్. జగన్నాథపురంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయం ఉన్న కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డు రూ. 3 కోట్ల 70 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టాం. ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ పరిసరాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టాం. ఇటీవల కోటప్పకొండ నుంచి కొత్తపాలెం గ్రామం వైపు వెళ్లే రోడ్డును సుమారు రూ. 4 కోట్లతో తో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చాం. వాడపల్లి ఏడువారాల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్ధం గోదావరి కరకట్ట వెంబడి రోడ్డు నిర్మాణానికి రూ. 6 కోట్ల సాస్కీ నిధులు మంజూరు చేశాం. ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, సాస్కీ నిధులతో రూ. 40 కోట్లకు పైగా వెచ్చించి సుమారు 22 ప్రధాన దేవాలయాలకు రోడ్డు వసతి కల్పిస్తున్నాం. మరెన్నో చిన్న ఆలయాలకు రవాణా సౌకర్యాన్ని కూడా అభివృద్ధి చేస్తున్నాం. నూతన శ్రీకాళహస్తి ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో అరుణాచలం మాదిరి ప్రతి పౌర్ణమికీ ప్రత్యేకంగా శ్రీకాళహస్తి కైలాసగిరి ప్రదక్షణ నిర్వహించాలని సూచిస్తున్నాం. కూటమి ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికీ, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నుంచి వర్చువల్ గా తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, శ్రీకాళహస్తి ఆలయ పాలక మండలి ఛైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, రాష్ట్ర హస్త కళల నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, తిరుపతి ఫారెస్ట్ కన్జర్వేటర్ సెల్వం, డీఎఫ్ఓ సాయిబాబా, శ్రీకాళహస్తి ఆలయ ఈవో బాపిరెడ్డి, ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

# కల్తీపై కఠిన చర్యలు



(మొదటి పేజీ తరువాయి)

తనిఖీల సమయంలో ఆహార పదార్థాల తయారీలో కల్తీకి పాల్పడిన వారిపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కేసులను నమోదు చేస్తున్నామన్నారు. శాఖాపరంగా ఆహార కల్తీల గుర్తింపునకు నిఘా పెంచామని తెలిపారు. 2025-26లో జనవరి వరకు 4,303 సాంపిల్స్ సేకరించి 233 కేసులను ఇప్పటివరకు నమోదు చేశామని చెప్పారు. =ం. 31.80 లక్షలను పెనాలిటీ కింద రెస్టారెంట్స్, హోటళ్ల నుంచి వసూలు చేశామని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు.

**కొన్ని కేసుల్లో... :** కొన్ని కేసుల్లో వాడిన నూనెను మళ్ళీ ఉపయోగిస్తున్నారని గుర్తించామని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. ఈ నెల తొలి వారంలో ఒంగోలు, రాజమహేంద్రవరం, గుంటూరు నగరాల్లో తనిఖీలు జరిగాయని తెలిపారు. మొత్తం 56 రెస్టారెంట్లు, హోటళ్ల నుంచి 59 ఆహార పదార్థాల నమూనాలు సేకరించి, 13 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. 385 కేజీల ఆహార పదార్థాల తయారీకి వినియోగించే వస్తువులను సీజ్ చేసినట్లు వివరించారు. ఆహార పదార్థాల తయారీ నమూనాలు పరీక్షించినప్పుడు 'అన్సేఫ్' అని రుజువు జరిగితేనే ఆరునెలల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఇందులో ఉన్న లొసుగుల ఆధారంగా పలువురు అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు ఆహారంలో సింథటిక్ కలర్స్ ఉపయోగిస్తున్నారని, నీటి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండడంపై అవగాహన కల్పిస్తూనే శాఖాపరంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు.

**తిరుపతి, గుంటూరు, తిరుమల, మరో రెండు చోట్ల ల్యాబ్స్ ఏర్పాటు :** "2014లో రాష్ట్ర విభజన జరిగినప్పటికీ హైదరాబాదులోని ఇన్స్టిట్యూటు అఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) విభజన 2022లో జరిగింది. దీనికితోడు 579 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీఎం చంద్రబాబు 150 నియామకాలు చేపట్టేందుకు ఆమోదం తెలుపగా తదుపరి చర్యలు వివిధ దశల్లో ఉన్నాయి. ఐపీఎం ప్రధాన కార్యాలయంలో మంజూరైన 279కు 272 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకి కూడా చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ ఆథారిటీ అఫ్ ఇండియా సహకారంతో రూ. వంద కోట్ల వ్యయంతో రాష్ట్రంలో కొత్తగా 5 ల్యాబులు సిద్ధమవుతున్నాయి. విశాఖలో ఇప్పటికే ఒక ల్యాబ్ నిర్మాణం పూర్తయింది. రెండు, మూడు నెలల్లో ఈ ల్యాబ్‌లో పరీక్షలు ప్రారంభమవుతాయి. తిరుపతిలోని ల్యాబ్ కూడా సిద్ధమవుతోంది. కర్నూలులోని కొత్త ల్యాబ్ను నోటిపై చేయాల్సి ఉంది. తిరుమలలో ప్రత్యేకంగా స్టేటు ల్యాబ్ సిద్ధమవుతోంది. అత్యాదునిక పరికరాలను ఇక్కడ సమకూరుస్తున్నాం. గుంటూరులోని ల్యాబ్ కూడా సిద్దం అవుతోంది." అని మంత్రి సత్యకుమార్ వివరించారు.

# హార్బర్ల ఆధునికీకరణ



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో కోస్తా ప్రాంత అభివృద్ధి, ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల స్థితిగతులు, ముత్యాలమ్మపాలెం ప్రాజెక్ట్ పురోగతి గురించి స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. దీనికి సమాధానంగా వ్యవసాయ,మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రానికి 12 కోస్తా జిల్లాల్లో కలిపి 1053.07 కి.మీ తీరప్రాంతం ఉండగా, 350 ల్యాండింగ్ సెంటర్లు, ఫిషింగ్ హార్బర్లు గుర్తించబడ్డాయని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో 10 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపట్టామని, 2020 సంవత్సరం జులై 15 నుంచి ఫిషింగ్ హార్బర్లు మత్స్యశాఖ నుంచి పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖకు బదిలీ అయ్యాయని పేర్కొన్నారు. తొలి దశలో జువ్వలదిన్నె, ఉప్పాడ, మచిలీపట్నం, నిజాంపట్నం హార్బర్లు నిర్మాణంలో ఉండగా, రెండో దశలో బుడగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం, వోడరేవు హార్బర్లు ప్రతిపాదనలో ఉన్నాయని తెలిపారు. పీఎంఎంఎస్‌వై, సాగరమాల, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సహకారంతో విశాఖ హార్బర్ ఆధునీకరణ పనులు రూ. 178.51 కోట్లతో కొనసాగుతున్నాయని, కాకినాడ హార్బర్ ఆధునీకరణకు రూ. 58.95 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేయడానికి సీఐసీఈఎఫ్ అంగీకరించిందని వివరించారు. అలాగే ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల విషయంలో అంతర్వేది పల్లిపాలెం, గుండయపాలెంలో జెట్టీ సౌకర్యాలతో కార్యకలాపాలు సాగుతున్నాయని, భావనపాడు ఎఫ్ఎల్‌సీకు నది ముఖద్వారం స్థిరీకరణ కోసం అవసరమైన సాంకేతిక చర్యలను ఏపీఎంబీకు తెలియజేశామని చెప్పారు. పీఎంఎంఎస్‌వై కింద రూ. 126.91 కోట్లతో దొండువాక, ఉప్పలంక, భీమిలి, రాజయ్యపేట, చింతపల్లి, రాయదరువులో ఖీజల అభివృద్ధి టెండరింగ్ దశలో ఉందన్నారు. మచిలీపట్నం, బియ్యపుతిప్ప ఎఫ్ఎల్‌సీ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం ప్రాంతానికి సంబంధించి ప్రజల అభ్యర్థన మేరకు సీఐసీఈఎఫ్ ద్వారా ప్రీ-ఫీజిబిలిటీ అధ్యయనాలు నిర్వహించబడినట్లు, తుది నివేదికలు అందాల్సి ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు. నివేదికలు వచ్చిన వెంటనే సాంకేతిక సాధ్యత ఆధారంగా మినీ జెట్టి/ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణంపై తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రప్రభుత్వం కోస్తాప్రాంత మత్స్యకారుల జీవనోపాధి మెరుగుదలకు కట్టుబడి ఉందని, అవసరమైన అన్ని మౌలిక వసతులు దశలవారీగా అభివృద్ధి చేస్తామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చేపట్టిన ఈ ఆధునీకరణ కార్యక్రమాలు పూర్తయ్యాక కోస్తా ప్రాంతాల్లో మత్స్యరంగానికి కొత్త ఊపొస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## కాళీమాత ఆలయం వద్ద అన్నదానం



**తెనాలి(, జర్నలిస్ట్ ఫైల్):** దానాలన్నిటిలో అన్నదానం మిన్న అని, అన్నదానం చేసే వారికి సంతృప్తి, స్వీకరించే వారికి తృప్తి రెండు ఉంటాయని కాళీమాత ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్ పేర్కొన్నారు.

స్థానిక బురిపాలెం రోడ్ లోని కాళీమాత గుడి సెంటర్ లో, శుక్రవారం విశేషంగా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగ భైరవ సాయిబాబా జయలక్ష్మి దంపతుల విత్తరణతో అన్నదాన సేవలను నిర్వహించారు. కార్యక్రమ విశిష్టతను, కాళీమాత ఆలయ కమిటీ చైర్మన్, గుమ్మడి రమేష్ మీడియాకు వివరించారు. భక్తుల సహకారంతో, ప్రతి నెల రెండో శుక్రవారం ఓ కార్యచరణగా అన్నదాన సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నదాన సేవా కార్యక్రమంలో, దాతలు,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# చేనేతలందరికీ ఉచిత విద్యుత్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ అందజేయనున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. చేనేత వృత్తిలో కొనసాగే వారందరికీ ఈ పథకం వర్తింపజేయనున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మూడో రోజు శుక్రవారం శాసనమండలిలో ప్రశ్నోత్తర సమయంలో వైసీపీ సభ్యులు మురుగుడు హనుమంతరావు అడిగిన ప్రశ్నకు రాష్ట్ర చేనేత, జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత పైవిధంగా సమాధానం చెప్పారు.

పోగును వస్త్రంగా మార్చి మనుష్యుల ఆత్మగౌరవాన్ని కాపాడే మహనీయులు నేతన్నలని కొనియాడారు. చేనేతలకు అన్న ఎన్టీఆర్ తొలుత అండగా నిలుస్తే, 2014-19లో సీఎం చంద్రబాబునాయుడు పాలన నేతన్నలకు స్వర్ణయుగంలా గడిచిందని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ అందజేయబోతున్నామన్నారు. చేనేత వృత్తిలో ఉన్న వారందరూ ఉచిత విద్యుత్ కే అర్హులేనన్నారు. మగ్గం నేసే నేతన్నలకు 200 యూనిట్ల అందజేయబోతున్నామని, దీనివల్ల ఆయా నేతన్నల కుటుంబాలకు నెలకు రూ. 720లు, ఏడాదికి రూ. 8,640లు ఆదా కానుందన్నారు. మర మగ్గం నేసే నేతన్నలకు 500 యూనిట్లు ఉచితంగా సరఫరా చేయనున్నామని, దీనివల్ల ఆయా కుటుంబాలకు రూ. 1,800లు, ఏడాదికి రూ. 21,600 ఆర్థికంగా మేలు చేకూరనుందన్నారు. 2014-19 మాదిరిగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత కూడా త్రిఫ్ట్ ఫండ్ నిధులు అందజేస్తున్నామన్నారు. అవసరమైన మేరకు చేనేత సహకార సంఘాల నుంచి చేనేత వస్త్రాలు కొనుగోలు చేస్తున్నామని, గతంలో చేనేత సహకార సంఘాలకు పెట్టిన బకాయిలు కూడా చెల్లిస్తున్నామని వెల్లడించారు. 50 ఏళ్లు నిండిన నేతన్నలకు పెన్షన్లు ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబుదేనని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత నేతన్నలకు ఇచ్చే పెన్షన్ల మొత్తాన్ని రూ. 3 వేల నుంచి రూ. 4 వేలకు పెంచామని, నేటి వరకూ రూ. 495 కోట్లు పెన్షన్ల రూపంలో అందజేశామని వెల్లడించారు.

**దారి మళ్లిన రూ.120 కోట్లు రాబడతాం... :** నేతన్నల కష్టాలకు గత ప్రభుత్వమే కారణమని మంత్రి సవిత స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఆప్కోను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ఆప్కో పేరుతో కేంద్రం నుంచి తీసుకొచ్చిన రూ. 120 కోట్లు గత దారి మళ్లించిందన్నారు. ఆ నిధులు ఏవిధంగా వాడారో కూడా తెలియడం లేదన్నారు. దారి మళ్లిన రూ. 120 కోట్లను రాబట్టడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతోందని స్పష్టం చేశారు. ఏళ్ల తరబడి ఆప్కోలో మురుగు పోతున్న పాత స్టాక్ ను తొలగించి కొత్తగా కొనుగోలు చేసిన వస్త్రాలను అమ్మకాలకు పెడుతున్నామన్నారు. దీనివల్ల ఆప్కోలో అమ్మకాలు గణనీయంగా పెరిగాయన్నారు. చేనేత వస్త్రాల అమ్మకాలు మరింత పెరిగేలా టాటా, తనేరియా, బిర్లా సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నామన్నారు. వస్త్రాల తయారీలో నేతన్నల స్కిల్ పెరిగేలా బాపట్ల, గుంటూరు, తూర్పు గోదావరి, తిరుపతి, సత్యసాయి జిల్లాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

**నూతన పాలసీతో 2 లక్షల మందికి ఉపాధి :** చేనేత రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు నాయుడు నూతన టెక్స్‌టైల్స్ పాలసీని రూపకల్పన చేశారని మంత్రి సవిత తెలిపారు. ఈ పాలసీ ద్వారా రాష్ట్రంలో రూ. 10 వేల కోట్ల పెట్టుబడులు రాబట్టే చర్యలు తీసుకుంటున్నామన్నారు. నూతన పాలసీతో చేనేత రంగంలో రెండు లక్షల మందికి ఉపాధి కల్పించాలన్నది ప్రధాన ఉద్దేశమన్నారు. చేనేత ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి చేనేత వస్త్రాల అమ్మకాలను పెంచామన్నారు. ఈ కామర్స్ లోనూ చేనేత అమ్మకాలు చేస్తున్నామని, ఆన్ లైన్ సేల్స్ ద్వారా అమ్మకాలు మరింత పెరిగాయని తెలిపారు. గత ప్రభుత్వంలో నేతన్న భరోసా పథకం మాత్రమే అమలు చేసి చేతులు దులుపుకుందని, ఈ పథకం అమలులో అర్హత లేని వైసీపీ కార్యకర్తలకు 40 వేల మందికి లబ్ధి చేకూర్చారని మంత్రి సవిత మండిపడ్డారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తాం

- **40 శాతం పాఠశాలలు 2 స్టార్ కంటే తక్కువగా ఉన్నాయి**
- **నాడు-నేడుపై చిత్తశుద్ధి ఉంటే పెండింగ్ బిల్లులు ఎందుకు చెల్లించలేదు**
- **ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతాం**
- **శాసనమండలిలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. 2020 నుంచి 2026 వరకు ఆర్థిక సంవత్సరాల వారీగా మనబడి నాడు-నేడు, మనబడి -మన భవిష్యత్ పథకాల కింద ఖర్చు చేసిన నిధుల వివరాలు, ఆయా పథకాల కింద పూర్తిగా అభివృద్ధి చేసిన, ఇంకా అభివృద్ధి చేయాల్సిన పాఠశాలల వివరాలపై సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, టి.కల్పలత, ఎంవీ రామచంద్రారెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ... కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం రూ. 7,500 కోట్లు ఖర్చుపెట్టాల్సిన అవసరం ఉందని అధికారులు వివరించారు. ప్రతి పాఠశాలకు స్టార్ రేటింగ్ ఇవ్వాలని నేను చెప్పాను. 18 అంశాలపై స్టార్ రేటింగ్ ఇచ్చాం. స్టార్ రేటింగ్ ఇచ్చిన తర్వాత మేం గమనించింది.. సుమారు 40 శాతం పాఠశాలలు 2స్టార్ కంటే తక్కువగా ఉన్నాయి. వీటిని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉన్నాం. క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ చాలా ముఖ్యం. నేను చిత్తూరు పర్యటకు వెళ్లినప్పుడు కొన్ని పాఠశాలల్లో లీక్ ప్రూఫ్ బిల్డింగ్స్ లేవు, పేయింటింగ్, బేసిక్ బెంచెస్, ఫర్నిచర్స్ లేవు. ముందు లీక్ ప్రూవ్ బిల్డింగ్స్, బెంచ్ లు, పెయింటింగ్, ఫర్నిచర్, వాటర్, టాయిలెట్స్ అందించాలనేది మేం లక్ష్యంగా పెట్టుకున్నాం. పాఠశాలల్లో పెండింగ్ వర్క్స్ ఎక్కడ ఉన్నాయో మొత్తం సమీక్ష చేస్తున్నాం. జీవో 117కు ప్రత్యామ్నాయంగా మోడల్ ప్రైమరీ స్కూల్స్ కింద తరగతికో ఉపాధ్యాయుడు విధానాన్ని తీసుకువచ్చాం. గతంలో కేవలం 3 శాతం పాఠశాలల్లో తరగతికో ఉపాధ్యాయుడు ఉంటే.. ఇప్పుడు 33 శాతానికి తీసుకువచ్చాం. దీనివల్ల కొన్ని పాఠశాలల్లో ఎక్కువ తరగతి గదుల అవసరం ఉంది. వీటన్నింటిని పరిశీలించి మేం ముందుకు వెళ్తాం. గతంలో నాడు-నేడు కింద అభివృద్ధి చేసిన 233 పాఠశాలలు మూసివేయడం జరిగింది. నిధులు అ-నవసరంగా వృధా చేయకూడదు. ఎక్కడ అవసరమో అక్కడ అభివృద్ధి చేయాలనే లక్ష్యం పెట్టుకున్నాం. గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ పైనా దృష్టి సారించాం. 2019 నంచి 2024 వరకు లెర్నింగ్ అవుట్ కమ్స్ లో వెనుకబడ్డాం.

**కూటమి ప్రభుత్వంలో నాడు-నేడు కింద రూ.500 కోట్లు బకాయిలు చెల్లించాం :** వైసీపీ హయాంలో నాడు-నేడుపై చిత్తశుద్ధి ఉంటే పెండింగ్ బిల్లులు ఎందుకు చెల్లించలేదు? బిల్లులు చెల్లించి ఉంటే ఇబ్బంది ఉండేది కాదు. కూటమి ప్రభుత్వంలో రూ. 500 కోట్లు పెండింగ్ బిల్లులు చెల్లించడం జరిగింది. ఈ వివరాలన్నీ గత అసెంబ్లీ సెషన్స్ లో విద్యారంగంపై లఘు చర్చలో వెల్లడించాం. వైసీపీ వాకౌట్ చేయకుండా హౌస్ లో ఉంటే అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పేవాడిని. వాకౌట్ చేశారు కాబట్టి మీకు సబ్జెక్ట్ తెలియడం లేదు. వైసీపీ హయాంలో అద్భుతంగా పనిచేస్తే లెర్నింగ్ అవుట్ కమ్స్ ఎందుకు పడిపోయాయి? ఎఫ్ఎల్ఎన్ చూస్తే.. 84.3 శాతం మూడో తరగతి, 62.5 శాతం ఐదో తరగతి, 47 శాతం 8వ తరగతి విద్యార్థులు రెండో తరగతి పాఠ్య పుస్తకాలను చదవలేకపోయారు. అందుకే ఏఐ టూల్ ద్వారా గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ చేపట్టాం. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలతో పోటీ పడే విధంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

## మంగళగిరిలో మెగా జాబ్ మేళాకు విశేష స్పందన.

- **15 కంపెనీల ప్రతినిధులు హాజరు**
- **344 మంది ఉద్యోగాలకు ఎంపిక.**
- **రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకూ జీతం**
- **నారా లోకేష్ ధన్యవాదాలు తెలిపిన యువతీయువకులు**




**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** మంగళగిరి పట్టణంలోని ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాలు నిరుద్యోగులకు వరంలా మారిందని కూటమి నాయకులు పేర్కొన్నారు. వివిధ రంగాలలో ఉద్యోగ అవకాశాల కల్పనకై మెగా జాబ్ మేళాను వీటిజేఎం ఉ ఐవిటిఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. పదో తరగతి నుంచి ఇంటర్, డిప్లమా, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, బీఈ, బీటెక్, ఎంటెక్, బీఏ, బీఎస్సీ, బీకామ్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారు. 15 కంపెనీల్లో ఉద్యోగాలకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వాటి ఆధారంగా కంపెనీల్లో రూ. 10 వేల మొదలుకొని రూ. 50 వేల వరకూ జీతం లభించే ఉద్యోగాలకు 344 మందిని ఎంపిక చేసి నియామక ఉత్తర్వులను కూటమి నాయకుల చేతుల మీదుగా అందజేశారు. నియామక పత్రాలు పొందిన ఉద్యోగస్తులు మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె. సంజీవరావు మాట్లాడుతూ, 15 కంపెనీల ద్వారా సుమారు 344 ఉద్యోగావకాశాలు కల్పించడమైనదని, యువత ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని మంచి భవిష్యత్తు కోసం ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

వీటిజేఎంఉఐవిటిఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల డా. గోడవర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ మంగళగిరిలో నిర్వహించిన ఈ జాబ్ మేళాలో యువతి యువకులు తమ నైపుణ్యాల ద్వారా ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వం ద్వారా అందించవలసిన శిక్షణ కార్యక్రమాలను ఉపయోగించుకుని తమ నైపుణ్యాలలో మెరుగుపరుచుకోవాలని తెలిపారు.

పట్టణ టీడీపీ అధ్యక్షులు పడవల మహేష్, పట్టణ బీజేపీ అధ్యక్షులు మునగాల నాగేశ్వరరావులు మాట్లాడుతూ ఎంపిక అయిన యువతీ, యువకులను అభినందించారు. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే మెరుగైన అవకాశాలు పొందవచ్చని సూచించారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించడమే మంత్రి నారా లోకేష్ లక్ష్యమని తెలిపారు. యువతను సన్మార్గంలో పయనింపజేసేందుకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మంత్రి నారా లోకేష్ సహకారంతో మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించడమే మంత్రి నారా లోకేష్ లక్ష్యమని అన్నారు.

ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ ఉపాధ్యక్షులు వాసా పద్మ, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, వంగర హనుమాన్, నరేంద్ర, స్కిల్ డెవలప్మెంట్, ఎంప్లాయిమెంట్ మరియు సీడప్ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# 'నేషనల్ ట్రావెల్ మార్ట్'..నూతన అధ్యయనానికి నాంది

**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్) :** 'నేషనల్ ట్రావెల్ మార్ట్' కేవలం ఒక సమావేశం కాదు.. ఇది ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో ఒక సరికొత్త అధ్యయనానికి నాంది అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఫిబ్రవరి 13, 14 తేదీల్లో విశాఖలో నిర్వహిస్తున్న ఈ మెగా టూరిజం మార్ట్‌లో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ యొక్క తీరప్రాంతం, గిరిజన ప్రాంతాలు, వారసత్వ ప్రదేశాలు మరియు ఎకో-అడ్వెంచర్ టూరిజంను ప్రదర్శించడం, దేశీయ పర్యాటకాన్ని పెంచడమే లక్ష్యంతో టూర్ ఆపరేటర్లు, హోటల్ గ్రూప్ లు, ట్రావెల్ నిపుణులతో నిర్వహించిన సమావేశంలో పర్యాటక రంగం అభివృద్ధిలో టూర్ ఆపరేటర్ల ప్రాముఖ్యతను వివరిస్తూ టూర్ ఆపరేటర్లే మా బ్రాండ్ అంబాసిడర్లు అన్న మంత్రి దుర్గేష్ వ్యాఖ్యలతో హర్షధ్వానాలు వెల్లువెత్తాయి.



ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కేవలం ఆధ్యాత్మిక వారసత్వానికే కాకుండా, పరివర్తన మరియు ఆవిష్కరణలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోందని అన్నారు. జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య పుట్టిన ఈ నేల పట్ల రాష్ట్రం గర్వపడుతోందని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ సంస్కృతిని, రామాయణ కాలం నాటి దండకారణ్య విశేషాలను ప్రస్తావిస్తూ, పొరుగు రాష్ట్రాలతో సమన్వయానికి ప్రాధాన్యతనిచ్చారు. కేంద్రం సహకారంతో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పర్యాటక రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు. నూతన పర్యాటక పాలసీ 2024-29,పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా, సబ్సిడీలు, ఎస్జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, స్టాంపు డ్యూటీ మినహాయింపులతో ఇన్వెస్టర్లకు పెద్దపీట వేస్తున్నామన్నారు. కేవలం 18 నెలల్లో రూ. 20,088 కోట్ల విలువైన 117 ప్రాజెక్టులకు ఒప్పందాలు జరిగాయని, దీని ద్వారా 1,22,637 ఉద్యోగాల సృష్టికి మార్గం సుగమమైందని వెల్లడించారు. తద్వారా హోటల్స్, రిసార్ట్స్, థీమాటిక్ పార్క్ లు తదితరాలు పెద్దఎత్తున ఏర్పాటు చేయడానికి పెట్టుబడిదారులు ముందుకు వచ్చారన్నారు. కేవలం 'ఈజ్ ఆఫ్ డూయింగ్' మాత్రమే కాకుండా, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్' ద్వారా సింగిల్ విండో విధానంలో అనుమతులు జారీ చేస్తున్నామని స్పష్టం చేశారు. సరళీకృత విధానాలు, సింగిల్ విండో క్లియరెన్స్, ఇన్వెస్టర్ ఫెసిలిటేషన్ సెల్స్, రియల్-టైమ్ ట్రాకింగ్, పారదర్శకమైన భూ కేటాయింపులు నిర్ణీత కాలపరిమితిలో అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు.

**టూర్ ఆపరేటర్లు - మా స్టోరీ టెల్లర్స్:మంత్రి దుర్గేష్ :** ఆంధ్రప్రదేశ్ అందాలను దేశ విదేశాల పర్యాటకులకు పరిచయం చేసే కథకులు, ప్రచారకర్తలు, నిర్వాహకులు టూర్ ఆపరేటర్లు అని మంత్రి దుర్గేష్ కొనియాడారు.. "ప్రభుత్వం పునాది వేస్తే, టూర్ ఆపరేటర్లు దానికి ప్రాణం పోస్తారు. మీరు కేవలం వ్యాపారవేత్తలు కాదు, మా రాష్ట్ర అందాలను ప్రపంచానికి వినిపించే స్టోరీ టెల్లర్స్" అని మంత్రి దుర్గేష్ కొనియాడారు. టూర్ ఆపరేటర్లే ప్రభుత్వానికి, మార్కెట్ డిమాండ్‌కు మధ్య వారధి అని, వారే మా అసలైన రాయబారులని పేర్కొన్నారు. ప్రభుత్వం కొత్త సర్క్యూట్‌లను, క్రూయిజ్‌లను లేదా హోమ్‌స్టే నమూనాలను ప్రవేశపెట్టినప్పుడు వాటిని మెరుగుపరిచి, ప్రమోట్ చేసినప్పుడే అవి విజయవంతమవుతాయన్నారు. ప్రభుత్వ విజన్‌ను పర్యాటక ప్యాకేజీలుగా, మధుర జ్ఞాపకాలుగా మార్చే శక్తి టూర్ ఆపరేట్లకు ఉందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు టూర్ ఆపరేటర్లు చేతులు కలిపినప్పుడే పర్యాటకం వర్ధిల్లుతుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించాలని కోరారు. తద్వారా ఇన్ బౌండ్ టూరిజంను పెంచాలని సూచించారు. సృజనాత్మకత, సంస్కృతి, సామాజిక ప్రభావాల అద్భుత కలయికతో టూర్ ఆపరేటర్లు, ఇన్వెస్టర్లు మరియు భాగస్వాములు అందరం కలిసి ఆంధ్రప్రదేశ్‌ను భారత్‌లోనే అత్యంత శక్తివంతమైన పర్యాటక కేంద్రంగా (భారతదేశపు ఎక్స్‌పీరియన్స్ క్యాపిటల్) తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు.

**భవిష్యత్తు ప్రణాళికలులి:** విశాఖ నుండి అరకు వరకు త్వరలో కారవాన్ టూరిజం ప్రారంభిస్తామని, గ్రామీణ సంస్కృతిని పరిచయం చేసేలా హోమ్‌స్టేలు, బెడ్ అండ్ బ్రేక్ ఫాస్ట్ పాలసీ, టెంట్ సిటీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలో రాబోయే మైస్, ఫిల్మ్ టూరిజం పాలసీలు అసెట్-లైట్ మోడల్ పెట్టుబడులకు ఊతమిస్తాయని భావిస్తున్నామన్నారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి కుంభమేళా తరహాలో టెంట్ సిటీలను సిద్ధం చేస్తామన్నారు. రాష్ట్రం కేవలం టెంపుల్ టూరిజానికే పరిమితం కాకుండా ఎకో, అడ్వెంచర్, క్రూయిజ్, రివర్, అగ్రి, హెరిటేజ్, మెడికల్ మరియు వెల్ నెస్ టూరిజంకు పెద్దపీట వేస్తోందని వివరించారు. మన రాష్ట్రం పర్యాటక రంగంలో ఒక 'స్టార్టప్' లాంటిది. ఇక్కడ వేగం, కొత్త ఆలోచనలు, అద్భుతమైన వృద్ధికి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు.

**డిజిటల్ విప్లవం - పర్యాటక భాగస్వామ్యుల కోసం ఏపీటీఏ ప్రారంభంలి:** పర్యాటక భాగస్వాముల కోసం ఆంధ్రప్రదేశ్ ట్రావెల్ పార్ట్ నర్ రిజిస్ట్రేషన్ అనే డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. ఇది పారదర్శకతను పెంచడమే కాకుండా,పర్యాటక శాఖతో నేరుగా సమన్వయం, డేటా అనలిటిక్స్ మరియు అంతర్జాతీయ వేదికలపై ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుందని ఆకాంక్షించారు. అలాగే 100కు పైగా 'అనుభవ కేంద్రాల' ద్వారా 20,000 మంది కళాకారులకు ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. 20 కొత్త ఎక్స్ పీరియన్స్ సెంటర్లను వృద్ధి చేస్తున్నామన్నారు. తద్వారా పర్యాటకులకు లీనమయ్యేలా, అత్యంత ప్రామాణికమైన, ప్రత్యక్ష సాంస్కృతిక అనుభూతులు అందిస్తామని పేర్కొన్నారు.

**వికసిత్ భారత్ 2047 మాదిరి ఏపీలో స్వర్ణాంధ్ర విజన్ 2047 దిశగా కృషి:మంత్రి దుర్గేష్ :** తమ టూరిజం పాలసీ స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాన్ని చేరేలా రూపొందించామని మంత్రి దుర్గేష్ వివరించారు. పర్యాటక రంగంలో పెద్దఎత్తున ఉద్యోగాల కల్పన చేయడం, ఎకానమీ పురోగతికి తోడ్పాటు అందించడమే తమ ధ్యేయమన్నారు. సీఎం చంద్రబాబునాయుడు అన్నట్లు భవిష్యత్ లో ఒకే ఒక ఇజం ఉంటుంది అదే టూరిజం అని మంత్రి దుర్గేష్ ఉద్ఘాటించారు. దీంతో సభలో చప్పట్లు మారుమ్రోగాయి. పర్యాటక శాఖ ఉన్నతాధికారులు, అధికారులు ఇన్వెస్టర్లకు సరైన మార్గదర్శకత్వం అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పర్యాటక రంగానికి సంబంధించిన అన్ని అంశాలను పబ్లిక్ డొమైన్ లో ఉంచామన్నారు.

స్నేహపూర్వక పర్యాటక పాలసీ ద్వారా ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం ఇప్పుడే పుంజుకుంటోందన్నారు. ఈ ప్రయాణంలో టూర్ ఆపరేటర్లు భాగస్వాములు కావాలని కోరుతున్నానని అన్నారు. మన భాగస్వామ్యం ద్వారానే ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల అందాలను కూడా పర్యాటక మ్యాప్‌లోకి తీసుకురాగలమని భావిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అరకు కాఫీని ప్రమోట్ చేస్తున్నామన్నారు. అరకు రుచిని చూడాలని కోరారు. పర్యాటకుడు ఒకరోజు పర్యాటక ప్రాంతానికి వస్తే కనీసం 3-5 రోజులు ఉండేలా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. భిన్నత్వంలో ఏకత్వం తమ అభిమతం అన్నారు. ఏపీ కేవలం తాము మాత్రమే బాగుపడాలని కోరుకోవడం లేదని అందరూ బాగుపడాలని తమ ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా సర్వేజనా సుఖినోభవంతు, సకలజానాభివృద్ధే తమ లక్ష్యం, వసుధకై కుటుంబంగా ప్రపంచం ఉండాలన్న వ్యాఖ్యలు ఆసక్తిని కలిగించాయి.

ఆంధ్రప్రదేశ్ 'అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా' నేషనల్ ట్రావెల్ మార్ట్ 2026 దేశీయ పర్యాటక రంగంలో ఒక నూతన మైలురాయి అని వక్తలు పేర్కొన్నారు. ఇది ఒక శక్తివంతమైన ఉత్ప్రేరకమని నిరూపించిందని తెలిపారు. ఈ మార్ట్‌లో దాదాపు 700 రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయని నిర్వాహకులు తెలిపారు. భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుండి 500 మందికి పైగా బయ్యర్లు, ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుండి 80 మందికి పైగా సెల్లర్లు పాల్గొన్నారని పేర్కొన్నారు. వేల సంఖ్యలో జరిగిన బి2బి సమావేశాల ద్వారా పర్యాటక రంగంలో అర్థవంతమైన వ్యాపార మార్పిడిలు మరియు దీర్ఘకాలిక భాగస్వామ్యాలకు పునాది పడిందన్నారు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, బీహార్, జమ్మూ , కాశ్మీర్, ఉత్తరాఖండ్, అండమాన్, నికోబార్ వంటి దాదాపు అన్ని రాష్ట్రాల నుండి ప్రతినిధులు హాజరై, దీనిని ఒక మినీ ఇండియా పండుగలా మార్చడం విశేషం. ఈ మార్ట్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అధిక విలువ కలిగిన దేశీయ పర్యాటక గమ్యస్థానంగా రూపాంతరం చెందుతున్న తీరును ప్రపంచానికి చాటారు. ఆధ్యాత్మిక యాత్రలు, తీరప్రాంత పర్యాటకం, వారసత్వ సర్క్యూట్లు, గిరిజన పర్యాటకం, బౌద్ధ సర్క్యూట్, ఎకో-టూరిజం మరియు మైస్ వంటి వర్ధమాన రంగాల సామర్థ్యాన్ని విజయవంతంగా ప్రదర్శించారు. ఈ మార్ట్ ద్వారా రాష్ట్ర పర్యాటక భాగస్వాములు మరియు జాతీయ టూర్ ఆపరేటర్ల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేసింది.

ఏపీ పర్యాటక రంగ విశేషాలను పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలికాట వివరించారు. హబ్ మోడల్ పాలసీ, పార్ట్ నర్ షిప్, ప్రాసెస్ అద్భుతమైన ఫలితాలను ఇస్తోందని వారు తెలిపారు. ఏపీ పర్యాటక కొత్త పాలసీ 2024-29 ద్వారా కొత్త ఒరవడికి నాంది పలికామన్నారు.

కార్యక్రమంలో ఛత్తీస్ గడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నీలూశర్మ, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఏపీటీడీసీ ఎండీ, ఏపీటీఏ సీఈవో ఆమ్రపాలి కాట, ఛత్తీస్ గడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండీ వివేక్ ఆచార్య, ఏపీటీడీసీ ఈడీ పద్మావతి, ఏపీటీఏ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, ఏడీటీవోఐ ప్రెసిడెంట్ వేద్ ఖన్నా, విజయ్ మోహన్, స్వామినాయుడు, మహాపాత్ర, టూర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయి సాంస్కృతిక పోటీల్లో కెబిఎన్ ప్రతిభ

**విజయవాడ, ఫిబ్రవరి 13 (జర్నలిస్ట్ ఫైల్)**

విజ్ఞాన్ యూనివర్శిటీ ఈ నెల 6,7 తేదీల్లో నిర్వహించిన జాతీయస్థాయి సాంస్కృతిక పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరచి వివిధ విభాగా ల్లో బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి చెప్పారు. గురువారం కాలేజీలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విజ్ఞాన్ యూనివర్శిటీలో జరిగిన పోటీల్లో దేశవ్యాప్తంగా 20 వేల మంది విద్యార్థు లు పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో తమ విద్యార్థులు ఫోక్ డ్యాన్స్ విభాగం లో తృతీయ బహుమతి (రూ.8 వేలు క్యాష్ ప్రైజ్), వాద్య సంగీతం సోలో విభ ాగంలో తృతీయ బహుమతి (రూ.1,000 క్యాష్ ప్రైజ్), షార్ట్ ఫిల్మ్ పోటీలో తృతీ య బ హుమతి (రూ.12 వేలు క్యాష్ ప్రైజ్), మెహంది విభాగంలో ద్వితీయ బహు మతి (రూ.1,500 క్యాష్ ప్రైజ్), మండల ఆర్ట్స్ విభాగంలో తృతీయ బహుమతి (రూ.1,000 క్యాష్ ప్రైజ్) గెలుచుకున్నట్లు చెప్పారు. హిందూ హై స్కూల్స్ అడ్మిని స్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు కళలు, సాం స్కృతిక అంశాల్లో రాణించటానికి తమ సంస్థల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పా రు. కళాశాల డ్రమటిక్ అసోసియేషన్ సమన్వయకర్త శేషుమణి, ప్రజ్ఞ క్లబ్ కన్వీనర్ రవిలను అభినందించారు.

## బెల్లా రవికి యువ న్యాయవాదుల భారీ మద్దతు



**విజయనగరం, ఫిబ్రవరి 13 (జర్నలిస్ట్ ఫైల్)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలు శుక్రవారం జరగనున్నాయి. మొత్తం 25 సభ్య స్థానాలకు గాను 143 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీటిలో 30 శాతం సీట్లు మహిళా అభ్యర్థులకు కేటాయించగా, రెండు స్థానాలు నామినేటెడ్ సీట్లుగా ఉన్నాయి. మిగిలిన స్థానాలకు అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు.విజయనగరం బార్ అసోసియేషన్‌కు చెందిన బెల్లా రవి 88వ నంబరు అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆయన విజయనగరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, ఎన్‌డీపీఎస్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా, ప్రభుత్వ న్యాయవాదిగా పలు కీలక పదవులు నిర్వహించారు. ప్రస్తుతం నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోలో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సేవలందిస్తున్నారు.సివిల్, క్రిమినల్ కేసులలో విశేష అనుభవం కలిగిన బెల్లా రవికి విజయనగరం జిల్లాతో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి కూడా యువ న్యాయవాదులు, సీనియర్ న్యాయవాదులు విస్తృత మద్దతు ప్రకటిస్తున్నారు.

## గోద్రేజ్ ఆగ్రోవెట్ 'టకాయ్' మార్కెట్లోకి విడుదల

**ముంబాయి, ఫిబ్రవరి 13 (జర్నలిస్ట్ ఫైల్)**




గోద్రేజ్ ఆగ్రోవెట్ సరికొత్త కీటక నాశని టకాయ్ మార్కెట్లోకి విడుదలైంది. ఈ సందర్భంగా ఓ హోటల్లో జరిగిన కార్యక్ర మంలో గోద్రేజ్ ఆగ్రోవెట్ క్రాప్ ప్రొడక్షన్ బిజినెస్ సీఈవో ఎస్ కే రాజవేలు మాట్లాడుతూ భారతదేశంలో వైవిధ్యభరి తమైన వాతావరంలో వరి సాగు చేసిన రైతుల ప్రయోజనాల కోసం తమ సంస్థ టకాయ్ ని అందుబాటులోకి తెచ్చిందని చెప్పారు. జపాన్ కు చెందిన ఐఎస్కే సంస్థ సైక్లాప్రిన్ టీహెచ్ఎం టెక్నాలజీతో ఈ టకాయ్ ని రూపొందించిందని తెలిపారు. వరిలో ప్రధానంగా కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పరుగులను నాశనం చేయడంలో ఇది అత్యంత ప్రభావవంతంగా పని చేస్తుందని వివరించారు. నాట్లు వేసిన తర్వాత కీలకమైన ప్రాథమిక దశ అయిన 15 నుంచి 30 రోజుల మధ్య ఒకసారి, మళ్లీ 40 నుంచి 60 రోజుల మధ్యలో ఒకసారి 160 మిల్లీ లీటర్ల మోతాదులో పిచికారీ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఈ మందు పంటలను ఆశించిన పురుగులు ఆహారం తీసుకోకుండా తక్షణమే అడ్డుకుంటుందని, దీర్ఘకాలం పాటు తెగుళ్లను అదుపు చేస్తుందని తెలిపారు. దీనివల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని, ఉత్పత్తి పెరుగుతుందని, స్థిరమైన మంచి ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. టకాయ్ అనేది వరితోపాటు మొక్కజొన్న, మిరప, క్యాబేజీ, సోయాబీన్, శనగ, చెరుకుబ పంటలకు కూడా వినియోగించవచ్చని వివరించారు. రైతుల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణ కోసం తమ సంస్థ చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పారు. ఈకార్యక్రమంలో జోనల్ హెడ్ మధు, అసిస్టెంట్ మేనేజర్ మురళి మోహన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### ఎంఎస్ఎంఈ

## భవన నిర్మాణాలకు సత్వర అనుమతులు

- పారిశ్రామిక సంస్థలతో సమానంగా మినహాయింపులు, దరఖాస్తుల పరిష్కారం
- కొత్త వెసులుబాట్లతో సేవారంగ ఎంఎస్ఎంఈలకు ఊతం
- ఎన్టీఆర్ జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు

**విజయవాడ, ఫిబ్రవరి 13 (జర్నలిస్ట్ ఫైల్)**

రాష్ట్ర ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కార్యక్రమాన్ని స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కీలక నిర్ణయాలు తీసుకుందని, ఎంఎస్ఎంఈ సేవారంగ సంస్థలకు భవన నిర్మాణ ప్రణాళికల అనుమతుల దరఖాస్తులను పారిశ్రామిక సంస్థలతో సమానంగా పరిష్కరించడంతో పాటు మినహాయింపులు కూడా అదేవిధంగా ఉంటాయని ఎన్టీఆర్ జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ అభివృద్ధి ప్రాధికార సంస్థలు (యూడీఏ), పట్టణ స్థానిక సంస్థల (యూఎల్‌బీ) పరిధిలోని సేవారంగ ఎంఎస్ఎంఈలు ఉద్యమ్ పోర్టల్‌లో నమోదై ఉన్నట్లయితే ఈ వెసులుబాటు ఉంటుందని వివరించారు. ఆటోమొబైల్ సర్వీసింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆరోగ్య సేవలు, లాజిస్టిక్స్, హోటళ్లు (20 గదుల వరకు), ఫంక్షన్ హాళ్లు, లాండ్రీ–డ్రై క్లీనింగ్ సేవలు, గోదాము సేవలు, పర్యాటక సేవలు వంటి సేవల కార్యకలాపాలకు సంబంధించిన ఎంఎస్ఎంఈలకు తాజా నిర్ణయం ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఈ ప్రయోజనాలను కచ్చితంగా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈలకు వేగవంతమైన అనుమతులు, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం, పారిశ్రామిక అభివృద్ధిని విస్తృతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషిచేస్తోందన్నారు. గౌరవ కలెక్టర్ వారి అధ్యక్షతన జరిగిన డీఐఈపీసీ సమావేశంలోనూ ఈ మినహాయింపులపై పారిశ్రామిక వర్గాలకు అవగాహన కల్పించినట్లు జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు తెలిపారు.

# భక్తుల భద్రత, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

- మహా శివరాత్రి సందర్భంగా అప్రమత్తంగా ఉండాలి
- అధికారులు పటిష్ట సమన్వయంతో పనిచేయాలి
- ఎగ్జిబిషన్లకు డెయిలీ ఫిట్‌నెస్ చెకింగ్ రిజిస్టర్ ఉండాల్సిందే
- అత్యంత నాణ్యంగా అన్న, ఇతర ప్రసాదాలు అందించాలి
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఫిబ్రవరి 13 (జర్నలిస్ట్ ఫైల్)**

జిల్లావ్యాప్తంగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులకు సూచించారు.కలెక్టర్ లక్ష్మీశ గురువారం క్యాంపు కార్యాలయం నుంచి దేవాదాయ శాఖ అధికారులతో పాటు వివిధ ఆలయాల ఈవోలు, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రతలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంతో పాటు జిల్లా వ్యాప్తంగా శివాలయాలకు పెద్దఎత్తున భక్తులు రానున్న నేపథ్యంలో ప్రణాళికాయుత చర్యలు తీసుకోవాలన్నారు. కృష్ణానదీ తీరంలోని దుర్గాఘాట్, పున్నమి ఘాట్, భవానీ ఘాట్, పవిత్ర సంగమం వంటి ప్రాంతాల్లో భక్తులు భారీ సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించే అవకాశం ఉన్నందున ఈ నెల 14, 15 తేదీల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఘాట్ల వద్ద, క్యూ లైన్లలో నిరంతరం పహారా కాయాలని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు భక్తుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నిఘా ఉంచాలని పోలీసు శాఖకు సూచించారు. బ్యారికేడింగ్, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ఘాట్ల వద్ద నిరంతర పారిశుధ్య పనులు చేపట్టాలని, భక్తులకు తాగునీరు, మొబైల్ టాయిలెట్ల సౌకర్యం కల్పించాలని విజయవాడ నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. విజయవాడ, నందిగామ, తిరువూరు ఆర్డీవోలు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించాలని, వివిధ ఆలయాల్లో ముఖ్యంగా రద్దీ సమయాల్లో తొక్కిసలాట వంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధాన ఘాట్ల వద్ద మెడికల్ క్యాంపులు, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. పండగ రోజుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, ఘాట్ల వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. భక్తుల రక్షణను దృష్టిలో ఉంచుకొని 15 మంది శిక్షణ పొందిన గజ ఈతగాళ్లను మూడు షిఫ్టులలో ఘాట్ల వద్ద అందుబాటులో ఉంచాలని మత్స్య శాఖాధికారిని ఆదేశించారు. ఎక్కడైనా ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసినట్లయితే తప్పనిసరిగా వాటికి డెయిలీ ఫిట్‌నెస్ చెకింగ్ రిజిస్టర్లను నిర్వహించాలని ఆదేశించారు. అగ్ని ప్రమాదాలు జరక్కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని.. సీసీటీవీ, డ్రోన్లను కూడా ఉపయోగించాలని సూచించారు. కంట్రోల్ రూమ్‌లు కూడా ఏర్పాటు చేయాలన్నారు. మహిళా భక్తులు, చిన్నపిల్లలు, వయోవృద్ధుల భద్రతపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. అన్న ప్రసాదంతో పాటు లడ్డూ ప్రసాదాలను అత్యంత నాణ్యతతో అందించాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్ ఎన్.షణ్ముగం, ఆర్డీవోలు కె.బాలకృష్ణ, కె.మాధురి, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సేంద్రియ సాగుతో డబుల్ ధమాకా!

- ఇటు రైతుకు, అటు వినియోగదారులకూ మేలు
- ఆరోగ్యకర వ్యవసాయ ఉత్పత్తులతో సుస్థిర ఆదాయం
- మామిడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- రాయితీపై ఫ్రూట్ కవర్లు పంపిణీ
- ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**రెడ్డిగూడెం, ఫిబ్రవరి 13 (జర్నలిస్ట్ ఫైల్)**

వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ పద్ధతులను అవలంబించడం ద్వారా అటు రైతులకు, ఇటు వినియోగదారులకు 'డబుల్ ధమాకా' లాంటి మేలు జరుగుతుందని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ తిరువూరు ఆర్‌డీవో కె.మాధురితో కలిసి రెడ్డిగూడెం మండలం, రంగాపురం గ్రామంలో పర్యటించి, మామిడి తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పీవో) అభ్యుదయ రైతులతో మాట్లాడి ఫ్రూట్ కవర్ల వినియోగం, ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా మామిడి కాయలకు ఫ్రూట్ కవర్లు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మామిడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని.. ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫ్రూట్ కవర్ల వల్ల ఎలాంటి మచ్చ లేని, మంచి రంగుతో పరిమాణంలో మామిడి దిగుబడి ఉంటుందన్నారు. హెక్టారుకు 15 వేల కవర్లను 50 శాతం రాయితీతో ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఇలాంటి మామిడికి మార్కెట్లో మంచి రేటు ఉంటుందని, వినియోగదారులకు కూడా మంచి నాణ్యమైన ఆరోగ్యకర పండ్లు లభిస్తాయన్నారు. నిమ్మకాయ సైజులో కాయ ఉన్నప్పుడు కవర్ కట్టడం వల్ల పండ్ల ఈగలు, ఇతర కీటకాలు కాయను ఆశించలేవని.. దీనివల్ల రైతుకు పురుగుమందుల ఖర్చు బాగా తగ్గుతుందని, రసాయన అవశేషాలు లేని పండ్లు ఉత్పత్తి అవుతాయని వివరించారు. మామిడి రైతులు కూడా 100 శాతం ప్రకృతి సేద్య విధానాలను అనుసరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. జిల్లా అధికార యంత్రాంగం కృషితో ప్రభుత్వం మామిడి సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినందుకు మామిడి రైతులు ధన్యవాదాలు తెలియజేశారు. మామిడి రైతులకు ఇబ్బంది కలిగిస్తున్న కోడి పేనుపై దృష్టిసారిస్తున్నామని, శాస్త్రవేత్తల సహకారంతో చర్యలు తీసుకుంటామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి సేంద్రీయ మేళా ఏర్పాట్లపై స్థల పరిశీలన

**విజయవాడ, ఫిబ్రవరి 13 (జర్నలిస్ట్ ఫైల్)**



ఎన్‌టీఆర్ జిల్లా పరిధిలో ఫిబ్రవరి 21, 22 తేదీల్లో నిర్వహించనున్న జిల్లా స్థాయి సేంద్రీయ మేళా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పరిశీలించారు. ఎంపీడీఓ , స్థానిక ఆర్డీఓ, డీపీఎం--ఆర్‌వైఎస్ఎస్ అధికారులు మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులతో కలిసి కార్యక్రమ స్థలాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా మేళా నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు, రైతులకు అనుకూల ఏర్పాట్లు, ప్రదర్శన స్టాల్స్, శిక్షణ కార్యక్రమాలు, మార్కెట్ లింకేజెస్ వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఇచ్చారు. జిల్లా స్థాయి సేంద్రీయ మేళా ముఖ్య ఉద్దేశ్యం సేంద్రీయ రైతులకు మార్కెట్ లింకేజెస్ కల్పించడం, సేంద్రీయ వ్యవసాయంపై ఆసక్తి ఉన్న రైతులకు సామర్థ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, సేంద్రీయ ఉత్పత్తులపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అని తెలిపారు. మేళాలో సేంద్రీయ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ స్టాల్స్, శిక్షణ సదస్సులు, ప్రత్యక్ష ప్రదర్శనలు (డెమోన్స్ట్రేషన్స్), రైతు––నిపుణుల చర్చా వేదికలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 21న ఏ.కొండూరు మండలం కృష్ణాయపాలెం గ్రామంలోని మామిడి తోటలో ఈ మేళా నిర్వహించనున్నారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి, రైతులు తమ పొలాల్లో సేంద్రియ కార్బన్ పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఆదర్శ రైతులు, ఎఫ్‌పీఓలు , ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే సంస్థలకు సన్మానం చేయనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 22న విజయవాడలో ప్రకృతి వ్యవసాయ మేళా నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో రైతులు, వినియోగదారులు, కొనుగోలదారులను ఒకే వేదికపైకి తీసుకువస్తారు. రైతులు పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు మార్కెటింగ్ లింకేజీలు ఏర్పాటు చేయనున్నారు. ఎంఓయూలు, ఒప్పందాలు మరియు వివిధ మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పించబడుతుంది. రైతులకు తమ పంటలకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేళాలో ఈ–కామర్స్ సంస్థలు, బిగ్ బాస్కెట్ వంటి ప్రముఖ కొనుగోలు దారులు పాల్గొనన ున్నారు. ఆసక్తి గల రైతులు, వినియోగదారులు, కొనుగోలుదారులు 22వ తేదీన విజయవాడలో జరిగే మేళాలో పాల్గొనవలసిందిగా జిల్లా కలెక్టర్ కోరారు. జిల్లా వ్యాప్తంగా సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించి, రైతుల ఆదాయాభివృద్ధికి తోడ్పడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో ఆర్డీఓ మాధవి, డీపీఎం వై. శంకర్ నాయక్, భూమి ఆర్గానిక్ రఘురాం, ఎంఆర్‌ఓ, ఎంపీడీఓ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### శివరాత్రి ఏర్పాట్లను

## పరిశీలించిన ఎంపీపీ బందం శ్రీదేవి

**రంపచోడవరం, ఫిబ్రవరి 13 (జర్నలిస్ట్ ఫైల్)**



పోలవరం జిల్లా రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి గురువారం ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి రంప కొండ మీద శివరాత్రి కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు.అటవీశాఖ సిబీఈటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రంప వాటర్ ఫాల్స్ కోసం వచ్చే పర్యాటకుల నుండి వసూలు చేసే రుసుములో శివరాత్రి జాతరకుఏభై శాతం నిధులు, శివాలయ అభివృద్ధికి సిబ్బంది జీతభత్యాల కోసం ఏభై శాతం నిధులు ఖర్చు చేయాలని గతంలో తీర్మానించడం జరిగిందని కానీ ఆ మేరకు అటవీశాఖ అధికారులు నిధులను విడుదల చేయకపోవడం వలన ప్రస్తుతం జాతర నిర్వహణ కష్టసాధ్యంగా ఉన్నదని జాతర కమిటీ వారు ఎంపీపీ కి తెలియజేశారు.ఈ విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎంపీపీ అన్నారు. అలాగే జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూసుకోవాలని రంప శివరాత్రి ఉత్సవాలకు ఉన్న గొప్పతనాన్ని మనమంతా కలిసి మరింత గొప్పగా ఈ జాతర మహోత్సవాల నిర్వహణ కోసం కృషిచేద్దామని ఎంపీపీ శ్రీదేవి అన్నారు.

## ఖమ్మం కోర్టులో ఇంకుడు గుంతల నిర్మాణం



ఖమ్మం లీగల్, (జర్నలిస్ట్ ఫైల్) : స్వేచ్ఛ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కోర్టు ప్రాంగణం లో ఇంకుడు గుంతల నిర్మాణం వాటి నిర్వహణ పద్ధతులపై అవగాహన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జలమండలి అసిస్టెంట్ డైరెక్టర్ ఇంకుడు గుంతల ప్రత్యేక అధికారి డాక్టర్ జాల సత్యనారాయణ కోర్టు ఆవరణలో అనుకూలమైన ప్రదేశాన్ని ఎంపిక చేసి ఇంకుడు గుంత నిర్మాణం కోసం జిల్లా జడ్జి రాజగోపాల్ , జాల సత్యనారాయణ, స్వేచ్ఛ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు, ప్రముఖ న్యాయవాది చల్లా కోటయ్య తో కలిసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమం లో డాక్టర్ డి రమేష్ కుమార్ విశ్రాంత ఉపసంచాలకులు భూగర్భ జలవనరుల శాఖ, న్యాయమూర్తులు, న్యాయవాదులు, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి సురేందర్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ రాజగోపాల్ మాట్లాడుతూ సహజ వనరుల సంరక్షణ కోసం స్వేచ్ఛ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు చల్లా కోటయ్య చేస్తున్న సేవలు నేడు అవసరమని, అమూల్యమైనవి అభినందనీయం అన్నారు. సమాజం స్వచ్ఛంద సేవకులను ఎల్లప్పుడూ ఆదరిస్తుంది అన్నారు. మంచి కార్యక్రమాలకు మా వంతు సహకారం ఉంటుంది అన్నారు. సమాజోద్ధరణ కార్యక్రమాలకు కొంత సమయాన్ని భవిష్యత్ తరాల కోసం కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం మరియు వాటి నిర్వహణ పద్ధతులు సాంకేతిక సలహాలు సూచనల కోసం డాక్టర్ జాల సత్యనారాయణ 9989985102, లేదా డాక్టర్ డి రమేష్ కుమార్ 9866631720 చరవాణి ద్వారా సంప్రదించవచ్చు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి దిలీప్ , వెంకట్ గుప్తా, నేరేళ్ల శ్రీనివాస్, కొల్లి సత్యనారాయణ, ఎం నిరంజన్ రెడ్డి, ఆకుల శేఖర్ బాబు, ఆర్. ఎన్. స్వామి తదితరులు పాల్గొన్నారు.





## సిఐటియు ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా చింతూరులో కదం తొక్కిన కార్మికులు

చింతూరు డివిజన్ (జర్నలిస్ట్ ఫైల్) : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం చింతూరు లో ఏర్పాటు చేసిన సభ కారం సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. గిరిన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ సమ్మెను ఉద్దేశించి మాట్లాడినారు. ప్రధానంగా నాలుగు లేబర్ కోడ్లు ప్రవేశపెట్టి కార్మికుల శ్రమను దోచుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. పని గంటల విధానాన్ని మార్చివేసి దోపిడీ వ్యవస్థను ప్రవేశ పెట్టేందుకే లేబర్ కోడ్లను ముందుకు తెస్తుందన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ పేరు మార్చుతూ జి రామ్ జి పేరుతో ఉపాధి పథకాన్ని ఆర్ఎస్ఎస్ కబంధహస్తాల్లో బంధించే ప్రయత్నం చేస్తుందని దీనికి ప్రతి ఒక్కరు వ్యతిరేకించి ప్రజా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్ మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనాలు పెంచకుండా ఏళ్ల తరబడి వెట్టిచాకిరి చేయిస్తూ బానిసలుగా కార్మికుల బ్రతుకులు మారుస్తుందని ప్రశ్నించే గొంతుకలను నొక్కేసే విధంగా ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తుందని ఇటువంటి ప్రభుత్వానికి పోరాటాల ద్వారానే గుణపాఠం చెప్పాలన్నారు. మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు మడివి శ్రీదేవి మాట్లాడుతూ మోడీ పాలనలో కూటమి ప్రభుత్వం విద్యుత్ బిల్లులు పెంచుతూ ఉందని విద్యుత్ బిల్లులు సవరణ పేరుతో భారం మోపుతుందన్నారు. రోజు రోజుకు నిత్యావసర వస్తువులు పెరుగుతున్నాయని మహిళలకు కూటమి ప్రభుత్వం 18 వేల రూపాయలు అధికారంలోకి వస్తే ఇస్తామని చెప్పిన హామీ మరిచిందన్నారు. 50 ఏళ్లకే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వారికి పింఛను అమలు చేస్తామని చెప్పి రెండు సంవత్సరములు కావస్తున్న నేటికీ అమలు చేయలేదన్నారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు పండా కృష్ణయ్య మాట్లాడుతూ రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా ఎరువుల సబ్సిడీ కూడా నామమాత్రం గానే ఇచ్చిందని ప్రైవేటీకరణ పేరుతో నేడు విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిందన్నారు. పిల్లలను ప్రభుత్వ బడిలోనే చదివించాలని యు టి ఎఫ్ ఏర్పాటు చేసిన ప్రభుత్వ బడిలోనే చదవాలి విద్యలో ఎదగాలని కార్యక్రమం ప్రారంభించిందని ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలోనే తమ పిల్లలను చదివిస్తూ పాఠశాలలో మధ్యాహ్న భోజనం విద్యాభ్యాసం ఎలా జరుగుతుందో తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరిస్తూ పాఠశాలలలో తరచూ వెళ్లి పరిశీలించాలన్నారు. అనంతరం ఎర్రంపేట ఆర్టీసీ బస్టాండ్ నుండి పోలీస్ స్టేషన్, అంబేద్కర్ సెంటర్ ఇందిరా , రాజీవ్ సెంటర్ వరకు 400 మంది మహిళలు సిఐటియు జెండాలు పట్టుకొని నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొట్టం రాజయ్య, మడకం చిన్నయ్య, మహిళా సంఘం నాయకులు మల్లం సుబ్బమ్మ, అంగనవాడి రంగం, ఆశ వర్కర్స్ రంగం, వెలుగు వివో ఏ రంగం, స్కూల్ శానిటేషన్, ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం, విఆర్ఓ రంగం, జిసిసి రంగం నుండి నాయకులు సోడి దుర్గారావు, నూక రత్నం, రవ్వ వీరమ్మ, పుష్ప, సురేష్, రాములమ్మ, కుంజ రామయ్య, సోడి సుబ్బయ్య, స్వామి పాల్గొన్నారు.





## బూడిదంపాడు వివాహ వేడుకల్లో పాల్గొన్న మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దాసర శ్రీను



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం బూడిదంపాడు గ్రామంలో భారతి రియల్ ఎస్టేట్ అధినేత గుడిబండ్ల దీపక్ బావమరిది అమర్లపూడి వేణు వివాహ వేడుకలో పాల్గొన్న ఖమ్మం జిల్లా మాల మహానాడు అధ్యక్షులు దాసరి శ్రీను తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి ముదుసు జాకబ్ ప్రతాప్, జిల్లా అధ్యక్షులు కొర్లపాటి చిరంజీవి, కామా ప్రభాకర్, కరాటే వేణు, దాసరి శ్రీను, దామల్ల సత్యం, కొట్టే నరేందర్, జమ్మి వీరబాబు, చింతపల్లి వెంకటేశ్వర్లు, బిందె రమేష్ తదితరులు వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## నూరు శాతం సర్వే పూర్తి చేయాలి ఆర్డీఓ గ్లోరియా



బాపట్ల (జర్నలిస్ట్ ఫైల్) : నూరు శాతం సర్వే పూర్తి చేయాలని ఆర్డీఓ గ్లోరియా అన్నారు. బాపట్ల పురపాలక సంఘం కౌన్సిల్ హాల్ లొ బిఎల్ఓ లతో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, తహసిల్దార్ షాలిమ ఆధ్వర్యంలో రీ సర్వే పై సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బంది కి కేటాయించిన రీసర్వే పనులలో నూటికి నూరు శాతం పూర్తి చేయాలని నిర్లక్ష్యం వహించకుండా త్వరగా పూర్తిచేయాలని ఆర్డీవో గ్లోరియా సిబ్బందికి ఆదేశించారు.

## మచిలీపట్నం పార్లమెంట్ అధికార ప్రతినిధిగా

### మాజీ కౌన్సిలర్ శొంఠి రామకృష్ణ

### శుభాకాంక్షలు తెలిపిన బూరగడ్డ శ్రీకాంత్



గుడివాడ, ఫిబ్రవరి 13 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండి అనేక సేవా కార్యక్రమాలు చేసిన మంచి వ్యక్తి తెలుగుదేశం పార్టీ వీరాభిమాని, 29వ వార్డు మాజీ కౌన్సిలర్ శొంఠి రామకృష్ణ అని జనసేన పార్టీ గుడివాడ నియోజకవర్గఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ అన్నారు. గురువారం రామకృష్ణ ఇంటికి వెళ్లి సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన అనంతరం మాట్లాడుతూ

**శాసనసభ్యులు వెనిగండ్ల రాము**

శొంఠి రామకృష్ణకి పార్లమెంటు పరిధిలో పదవి ఇవ్వటం చాలా సంతోషమన్నారు. భవిష్యత్తులో రామకృష్ణ మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని కోరుతూ, కూటమి నాయకులకు ఎల్లప్పుడూ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయుకులు తిరుపతిరావు, చీకటి సూర్యనారాయణ, మొక్కపాటి సూర్యం, నీలిశెట్టి శ్రీను, జనసేన నాయుకులు విగ్నేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ సాయన రాజేష్, బుడమా రాజు, బూరగడ్డ వెంకటేశ్వర రావు,కంచనపల్లి నాగేశ్వరావు, రవికుమార్, సాయిపవన్ తదితరులు పాల్గొన్నారు.

## పోస్టల్ ఉద్యోగిని సత్కరించిన సి.జి.హెచ్.ఎస్ డాక్టర్లు



ఫిబ్రవరి 13(జర్నలిస్ట్ ఫైల్): పోస్టల్ డిపార్ట్మెంట్ లో మూడున్నర దశాబ్దాలు విశేష సేవలందించి, ఉద్యోగ విరమణ చేసిన పోస్టల్ అసిస్టెంట్ దేసు సుబ్బారావును సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ ( సిజిహెచ్ఎస్ ) డాక్టర్లు, ఉద్యోగులు సన్మానించారు. గురువారం నగరంపాలెం లోని సిజిహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్ లో జరిగిన కార్యక్రమంలో దేసు సుబ్బారావు దంపతులను సిజిహెచ్ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ టి.సిహెచ్.కోటేశ్వరరావు, సీనియర్ మెడికల్ ఆఫీసర్ కొండా నాగార్జున తదితరులు పట్టు శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ..పోస్టల్ శాఖకు, సిజిహెచ్ఎస్ కు ఎంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. గుంటూరు సిజిహెచ్ఎస్ ఏర్పాటుకు దేసు సుబ్బారావు ఎన్నో సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ కె.నాగార్జున మాట్లాడుతూ.. పోస్టల్ శాఖ ఇచ్చిన ప్రోత్సాహం, సహకారంతోనే సిజిహెచ్ఎస్ వైద్యశాలలన్నీ పోస్టల్ శాఖ భవనాల్లోనే కొనసాగుతున్నాయన్నారు. దేసు సుబ్బారావు మాట్లాడుతూ..తనను సొంత స్టాఫ్ గా భావించి, ఘనంగా వీడ్కోలు చెబుతున్న సిజిహెచ్ఎస్ డాక్టర్లకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిజిహెచ్ఎస్ లోకల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు గుమ్మడి సీతారామయ్యచౌదరి, ఉద్యోగులు అయోషా బేగం, సునీల్, పేరేశ్వరరావు, మురళీ, రామారావు, మక్బూల్, వెంకటేశ్వర్లు, రత్నరాజు, నందమణి పాల్గొన్నారు.

## అక్షర స్కూల్ లో జిజ్ఞాస-2026 ఎగ్జిబిషన్

### సైన్స్ ఫెయిర్ లు విజ్ఞాన భండాగారాలు

### ది జిల్లా గవర్నర్ డాక్టర్ జి మహేంద్ర కుమార్ రెడ్డి.

### ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి



తలకొండపల్లి: (జర్నలిస్ట్ ఫైల్) : తలకొండపల్లి లోని అక్షర హైస్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిజ్ఞాస-2026 ఎగ్జిబిషన్ సైన్స్ ఫెయిర్ కు ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా




గవర్నర్ డాక్టర్ జి మహేంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ "విద్యార్థి దశలో శాస్త్రీయ అవగాహన పెంపొందించడంలో ఈ విజ్ఞాన ప్రదర్శనలు ఎంతో దోహదం చేస్తాయని , ఈ ఆధునిక కాలంలో ఎంతో విజ్ఞన ప్రగతి జరిగినప్పటికీ ఇంకా కొన్ని మూఢ నమ్మకాలు సమాజంలో ఉన్నాయని,అవి బాల్యంలోనే పిల్లలకు మూఢ నమ్మకాలు అని అర్థమయ్యేలా చేయగలిగేవి ఈ సైన్స్ ఫెయిర్ లే అని చెప్పారు.వీటి ద్వారా హేతుబద్ధత పెరిగి పిల్లల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందిస్తుందని చెబుతూ ఇలాంటి సైన్స్ ఫెయిర్ ను వరుసగా పదోసారి నిర్వహిస్తున్న అక్షర పాఠశాల యాజమాన్యాన్ని ప్రశంసించారు. పాఠశాలలో జిజ్ఞాస 2026 సైన్స్ ఎగ్జిబిషన్ కోసం 240 పై గా మోడల్స్ విద్యార్థులు సిద్ధం చేశారు. ప్రీ ప్రైమరీ కేటగిరి, ప్రైమరీ కేటగిరి,హై స్కూల్ కేటగిరి వారిగా ఓటింగ్ విజేతలను ఎంపిక చేయడం జరిగింది. ఓటింగ్లో ఎగ్జిబిషన్ విసిట్ చేసిన వారందరూ పిల్లలకు ఓటు వేసి సహకరించడం జరిగింది.ఓటింగ్ లో గెలిచిన విద్యార్థులకు మోడల్స్, సర్టిఫికెట్స్ తో అభినందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో తలకొండపల్లి ఎంఈఓ చంప్లా నాయక్ ,తలకొండపల్లి,రాంపూర్ సర్పంచ్ లు కటికల శేఖర్, వట్టేల శ్రీశైలం, ఆమనగల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి , పి డి జి చెన్నకిషన్ రెడ్డి , క్యాబినెట్ కార్యదర్శి తాళ్ల అంజయ్య , కేబినెట్ ట్రెజరర్ బి ఆర్ రాంరెడ్డి ,జోన్ చైర్మన్ జూలూరి లింగయ్య ,పి ఆర్ కె నాగరాజు , పి ఎస్ ఎన్ రాజు ,గంప శ్రీను ,కందె ఓంకారం,జూలూరి రమేష్ ,జి శ్రీనివాస్ రెడ్డి ,చేగూరి వెంకటేష్ ,జల్కం రమేష్ ,పిప్పళ్ల వెంకటేష్ ,గూడ రాజు ,రావుల కుమార్ గౌడ్ , జహంగీర్ ఆలీ ,ఆప్టోమెట్రిస్ట్ రాజేందర్,క్లబ్ పి ఆర్ ఓ పాషా, రమేష్ ,శ్రీకాంత్ రెడ్డి మరియు ట్రస్మా ఉపాధ్యాయులు శ్రీనివాస్ గౌడ్ గోలి శ్రీనివాస్ రమేష్ లక్ష్మణ్ ,పాత్రికేయులు విష్ణువర్ధన్ ,వెంకట్ రెడ్డి , తిరుపతయ్య , శేఖర్ ,విజయ్, మహేష్ , సురేందర్ ,విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.



## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం

## వైద్యశాలలో సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలి

## రోగులు పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

### వైద్యశాల సూపర్డెంట్ డాక్టర్ సిద్ధార్థ.

బాపట్ల ఫిబ్రవరి 13 (జర్నలిస్ట్ ఫైల్) : బాపట్ల: పొట్టి శ్రీరాములు ఏరియా వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ వారిని ఆరోగ్యం వంతులుగా తీర్చిదిద్దుతున్నామని బాపట్ల ఏరియా వైద్యశాల సూపర్డెంట్ డాక్టర్ సిద్ధార్థ అన్నారు. గురువారం ఏరియా వైద్యశాలలో సిబ్బంది పనితీరు, ఎక్సరే, స్కానింగ్, రక్త పరీక్షలు, మందులు పంపిణీ చేసే గది, ఎమర్జెన్సీ వార్డ్, సాధారణ వార్డులు క్షుణంగా పరిశీలించి వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి సిబ్బంది పనితీరు రోగులతో ప్రవర్తిస్తున్న విధివిధానాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం వైద్యశాలలో ఓపి శాతం పెరిగిందని చాలామంది ప్రజలు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులను సంప్రదించి వైద్యశాలలో అందించే నాణ్యమైన మందులను వాడుతూ రోగులు వారి ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారన్నారు.

**సమస్యలుంటే నేరుగా తనను సంప్రదించాలి**

ఏరియా వైద్యశాలకు వచ్చే రోగులకు వైద్యశాలలో ఏమైనా సమస్యలు ఎదురైతే నేరుగా తనను కలిసి సమస్యను తెలపాలని ఎటువంటి ఇబ్బందులు లేకుండా తక్షణమే సమస్యను పరిష్కరించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతామన్నారు. వైద్యశాలలో 21 మంది నిపుణులైన వైద్యులు ఉన్నారని ఒక్కొక్క ఆరోగ్య సమస్యకు ఆ వైద్యులు సమస్యను బట్టి రోగానికి వైద్యం అందించడంతో పాటు నాణ్యమైన మందులు ఇచ్చి నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే బాధ్యత తమపై ఉందన్నారు. 21 డాక్టర్ల పర్యవేక్షణలో 89 మంది నర్సుల బాధ్యతతో కూడిన విధి నిర్వహణ చేస్తూ రోగులకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.





**రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవు**

పొట్టి శ్రీరాములు ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులు, ఓపి విధానంలో వచ్చే రోగుల పట్ల వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చూపించి వారికి సరైన సమాధానం చెప్పకుండా వ్యవహరిస్తే వారిపై విచారణ చేసి నిర్లక్ష్యం వహించినట్లు రుజువైతే వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రోగుల పట్ల సిబ్బంది ఓపికతో ఉంటూ సరైన సమాధానం చెప్పి ఆరోగ్యం వంతులుగా చేయాలని సూచనలు చేశారు. రోగులు కూడా విధి నిర్వహణలో ఉన్న వైద్యులను సిబ్బంది పట్ల అమర్యాదగా ప్రవర్తించకుండా దురుసుగా వ్యవహరించకుండా ఒత్తిడి లేని వైద్యాన్ని వైద్యుల నుండి పొందాలని రోగులకు సూచనలు చేశారు.

## మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక బస్సులు



వైరా, (జర్నలిస్ట్ ఫైల్) : మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 15వ తేదీన వైరా బస్టాండ్ నుండి వైరా మండలం స్నానాల లక్ష్మీపురం జాతరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ మధిర డిపో మేనేజర్ ఆర్. రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు 15వ తేదీ(ఆదివారం )తెల్లవారుజామున ఉదయం 3:00 గంటల నుండి వైరా బస్టాండ్ నందు ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందని అదేవిధంగా ఆరోజు రాత్రి స్వామి వారి కళ్యాణం అయిపోయేంత వరకు కూడా స్నానాల లక్ష్మీపురం నుంచి వైరాకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని వారు తెలిపారు. ఈ సదావకాశాన్ని వైరా మరియు పరిసర ప్రాంతాల భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. భక్తులు రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు.

## డార్విన్ జయంతి సందర్భంగా సహజ వ్యవసాయానికి శాస్త్రీయ ఆధారం గుర్తింపు



పులిచెర్ల, ఫిబ్రవరి 13 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త చార్ల్స్ డార్విన్ జయంతి (ఫిబ్రవరి 12, 1809) సందర్భంగా ఆయన ప్రతిపాదించిన "నేచురల్ సెలెక్షన్" సిద్ధాంతం ప్రకృతి వ్యవసాయానికి శాస్త్రీయ పునాది అని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోధి షాలి పేర్కొన్నారు. డార్విన్ జీవుల పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ "సర్వైవల్ ఆఫ్ ది ఫిట్టెస్ట్" అనే భావనను ప్రపంచానికి పరిచయం చేశారు. ప్రకృతికి అనుగుణంగా మారిన జీవులే నిలబడతాయని ఆయన వివరించారు. ఇదే సూత్రం సహజ వ్యవసాయ విధానాలకు వర్తిస్తుందని బోధి షాలి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "డార్విన్ జయంతి రోజు మనం గుర్తుంచుకోవాల్సింది ప్రకృతి సమతౌల్యం. స్థానిక విత్తనాలు, జీవ వైవిధ్యం, నేలలోని సూక్ష్మజీవులు -- ఇవే పంటల ఆరోగ్యానికి ఆధారం. రసాయనాల కంటే ప్రకృతి పద్ధతులే స్థిరమైన వ్యవసాయానికి మార్గం" అని అన్నారు. డార్విన్ జీవ వైవిధ్యానికి ఇచ్చిన ప్రాధాన్యత సహజ వ్యవసాయంలో కూడా ప్రతిఫలిస్తుందని, మిశ్రమ పంటలు, జీవామృతం వంటి పశువుల ఆధారిత ఇన్పుట్లు, నేల సజీవత్వాన్ని కాపాడే విధానాలు రైతులకు దీర్ఘకాల ప్రయోజనాలను అందిస్తాయని ఆయన వివరించారు. "ప్రకృతి తన నియమాల ప్రకారం పనిచేస్తుంది. మనం ప్రకృతితో కలిసి సాగు చేయాలి గాని, దానికి వ్యతిరేకంగా కాదు" అని, డార్విన్ జయంతి సందర్భంగా సహజ వ్యవసాయంపై అవగాహన పెంపు అవసరమని బోధి షాలి పేర్కొన్నారు.

## వెంకటాపూర్ లో శివ స్వాముల జ్యోతి ఇరుముడి

### హాజరైన సర్పంచ్ సర్పంచ్ బూజ్జురు పుష్పమ్మ అంజన్ రెడ్డి

### శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయం నూతన చైర్మన్: కుమ్మరి జగన్





తలకొండపల్లి: (జర్నలిస్ట్ ఫైల్) : తలకొండపల్లి మండలం వెంకటాపూర్ గ్రామంలో శివ స్వాముల జ్యోతి ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ బూజ్జురు పుష్పమ్మ అంజన్ రెడ్డి హాజరయ్యారు. శివ స్వాముల ఇరుముడి కార్యక్రమానికి గ్రామంలోని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయం నూతన చైర్మన్ కుమ్మరి జగన్ 10,000 వేల రూపాయలు శివ స్వాములకు అందజేయడం జరిగింది. జగన్ మాట్లాడుతూ శివ స్వాములు 41 రోజుల కఠిన దీక్షా నియమాలతో, ఇరుముడి (జ్యోతిర్ముడి) ధరించి శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకోవడానికి చేసే ఒక పవిత్రమైన యాత్ర. శివరాత్రి/కార్తీక మాసంలో వీరు పసుపు/కాషాయ వస్త్రాలు ధరించి, నల్లమల అడవుల గుండా శ్రీశైలం చేరుకుని, భ్రమరాంబికా మల్లికార్జున స్వామిని పూజిస్తారు. గ్రామంలో 12 మంది శివ మాల ధరించి శ్రీశైలం చేరుకోవడానికి గురువారం ఘనంగా ఇరుముడి కార్యక్రమం నిర్వహించిన స్వస్థములకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో వెంకటాపూర్ గ్రామ మూడవ వార్డు సభ్యుడు గొర్రె మల్లేష్ స్వామి, హరీష్ గురుస్వామి, హరీష్ కన్నె స్వామి, గ్రామ పెద్దలు యువకులు, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కీసర యువతి తేజశ్రీకి అల్లూరి పురస్కారం..!




ఫిబ్రవరి13(జర్నలిస్ట్ ఫైల్): తేజశ్రీ తన ప్రతిభతోనే కాకుండా తన క్రమశిక్షణ, అంకితభావంతో కూడా ప్రత్యేక గుర్తింపు పొందింది. ఒక యువతిగా కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూ,



వృత్తిపరంగా ముందుకు సాగడం సులభం కాదు. అయితే, తేజశ్రీ తన కృషి, పట్టుదలతో ప్రతి సవాల్‌ను అవకాశంగా మలుచుకుంది. వీడియో ఎడిటింగ్ రంగంలో ఆమె చూపుతున్న నైపుణ్యం, సృజనాత్మక దృష్టికోణం ఆమెను ప్రత్యేక స్థానంలో నిలబెట్టాయి. ప్రతి వార్తా కథనాన్ని సమాజానికి చేరే విధంగా భావోద్వేగంతో, నిబద్ధతతో తీర్చిదిద్దడం ఆమె ప్రత్యేకత. ఆమె చేసిన ప్రతి పని సమాజానికి ఒక సానుకూల సందేశాన్ని అందిస్తోంది. యువతులు తమ ప్రతిభను నమ్ముకుని ముందుకు సాగితే ఎంతటి శిఖరానికైనా చేరగలరని తేజశ్రీ తన ప్రయాణంతో నిరూపించింది. ఈ అవార్డు ఆమె సాధనకు మాత్రమే కాదు, భవిష్యత్తులో మరిన్ని విజయాలకు నాంది కూడా అని ముఖ్య అతిథులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి ప్రతిభావంతురాలిని సత్కరించడం తమకు గౌరవంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. తేజశ్రీ భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పురస్కారాలు అందుకుని తెలుగు రాష్ట్రాలకు గర్వకారణంగా నిలవాలని అందరూ ఆకాంక్షించారు.

## బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని కలిసిన గుర్ల తిరుమలేష్..



శేరిలింగంపల్లి (జర్నలిస్ట్ ఫైల్) : శేరిలింగంపల్లి నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ ఉద్యమ నాయకులు, సీనియర్ నేత గుర్లతిరుమలేష్ జన్మదిన సందర్భంగా గురువారం నందినగర్ లో మాజీ మంత్రి వర్యులు కేటీఆర్ ను కలిసి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ భవిష్యత్తులో పార్టీ కి మీలాంటి యువకులదే ప్రధాన పాత్ర ఉంటుందని రాబోయే రోజుల్లో మంచి మంచి అవకాశాలు మీలాంటి యువకులకే ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు , వాలా హరీష్ రావు, మల్లారెడ్డి, సంగారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, యాదగిరి, సాగర్, సోమేశ్వర్ రెడ్డి, ప్రసాద్ బాబు, మల్లేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల జోలికొస్తే తరిమికొడతాం

## కాంగ్రెస్ ఓటమికి భయపడి కొనుగోలుకు తెరలేపింది.



యాదాద్రి భువనగిరి జిల్లా ఫిబ్రవరి 13 (జర్నలిస్ట్ ఫైల్) : యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్పర్సన్ పదవి మాదే మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎస్టీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్రెడ్డి. ఓటమి పాలుకాబోతున్న కాంగ్రెస్ పార్టీ, ఇతర పార్టీ అభ్యర్థుల కొనుగోలుకు తెరలేపిందని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎస్టీసీసీబీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల జోలికొస్తే తరిమికొడతామని మాస్ వార్నింగ్ ఇచ్చారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంలోని గొంగిడి నిలయంలో మీడియా సమావేశంలో పాల్గొని పట్టణ ఓటర్లకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీలోని 10వ వార్డులో ఓడిపోతామని భావించే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆవుల మమతాసాయియాదవ్ను అప్రజాస్వామికంగా కొనుగోలు చేశారన్నారు. ప్రత్యక్ష ఓటింగ్లో పాల్గొనే దమ్ములేక స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఇలా డబ్బులతో రాజకీయాలు చేస్తున్నారన్నారు. గెలుపొందిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను కొనుగోలు చేయాలని ఇప్పటికే వ్యూహాలు పన్నుతున్నట్లుగా సమాచారం వచ్చిందన్నారు. ఏ ఒక్క అభ్యర్థిని కొనుగోలు చేస్తే యాదగిరిగుట్ట అగ్నిగుండంగా మారుస్తామని చెప్పారు. శవయాత్రలు చేసి కాంగ్రెస్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను ఎండగడతామన్నారు. దమ్ముంటే పోటీలో గెలిచినిలవాలన్నారు. ఇలా సిగ్గులేకుండా డబ్బులతో కొనుగోలు చేస్తామంటే చూస్తు ఉదుకునే ప్రసక్తేలేదన్నారు. యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ పదవి మాదేనని, ఇందుకు కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ ను గెలుచుకుని తీరుతామన్నారు. 11 వార్డుల్లో ఎన్నికలు జరుగుతుండగా 10 వార్డుల్లో పోటీలో నిలిచామని 3 వార్డుల్లో గులాబీ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. 2,3,4,5,7,8,9, 11, 12 వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలుస్తున్నారని తెలిపారు. అభ్యర్థుల మంచితనంతోపాటు కేసీఆర్ను ప్రజలు కోరుకోవడం, గత ప్రభుత్వ హాయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తమ అభ్యర్థులకు గెలుపు బాటలు వేశాయన్నారు. ఈ సారి అన్ని కులాల సముచిత గౌరవం ఇచ్చామన్నారు. మైనార్టీ, ఎరుకల, నాయీ బ్రాహ్మణులు, దొమ్మర, గౌడ్, యాదవ, ఎస్సీ కులస్తులకు సీట్లను కేటాయించామన్నారు. 12 వార్డు అభ్యర్థిగా దొమ్మర కులానికి చెందిన కంసాని కీర్తికి సీటును ఇచ్చామన్నారు. గతంలో ఏ పార్టీ దొమ్మర కులాన్ని గుర్తించలేదన్నారు. దొమ్మర కులానికి చెందిన మహిళా అభ్యర్థిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే అక్కను వెల్లగక్కుకున్నారన్నారు. అర్ధరాత్రి సమయంలో ఆమె ఇంటిని పోలీసులను పెట్టించి సోదాలతో ఇబ్బందులకు గురి చేశారన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ డబ్బులే లక్ష్యంగా ప్రచారం సాగించారన్నారు. ఓటర్లను ప్రలోబాలకు గురిచేశారన్నారు. ప్రతి ఓటరుకు డబ్బు, మద్యం సరఫరా చేశారన్నారు. మహిళలకు చీరెలు, వెండి వస్తులను ఇచ్చి ఓట్లను దండుకునే ప్రయత్నం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటేశామా అని ప్రజలు భావిస్తున్నారన్నారు. కేసీఆర్ ఉంటేనే మంచిదన్న భావనలో ప్రజలు ఉన్నారన్నారు. ఇప్పటికిప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లొస్తే కారుగుర్తుకు ఓటేసి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తే ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. కేసీఆర్ మార్క్ ఓటు అని వారే తమకు చెప్పడం ఆనందంగా ఉందన్నారు. ఎన్ని డబ్బులు తీసుకున్నా ఈ సారి మాత్రం కారుగుర్తుకే ఓటేస్తామని స్పష్టం చేసిన్నట్లు వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మాజీ సర్పంచ్ కసావు శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ యువజన విభాగం మండలాధ్యక్షుడు బీమగాని నర్సింహ్మగౌడ్, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు ముక్కర్ల సతీశ్ యాదవ్, 5వ వార్డు అభ్యర్థి మానుపాటి పరుశరాం, నాయకులు కల్వకోలను సతీశ్ భట్, లింగం, శారాజీ రాజేశ్ యాదవ్, మిట్ట నర్సింగ్, నర్సింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు..

# 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలి

### బోనకల్ లో దేశవ్యాప్త సమ్మె విజయవంతం

### సమ్మెలో పాల్గొన్న సిఐటియు, భవన నిర్మాణ, వ్యవసాయ రంగ కార్మికులు, సిపిఎం, సిపిఐ నాయకులు వివిధ కార్మిక సంఘాలు



బోనకల్, ఫిబ్రవరి 13 (జర్నలిస్ట్ ఫైల్) : కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా గురువారం బోనకల్ మండల కేంద్రంలో అన్ని కార్మిక సంఘాలు ఏకమై దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేశారు.




ఈ సమ్మెకు సిఐటియు, భవన నిర్మాణ కార్మికులు, అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు , వ్యవసాయ రంగ కార్మికులు తదితర కార్మిక రంగాలు పాల్గొని దేశ వ్యాప్త సమ్మెకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కిలారు సురేష్, సిపిఐ మండల కార్యదర్శి వెంగల ఆనందరావు, ఐద్వా మధిర డివిజన్ నాయకురాలు జొన్నలగడ్డ సునీత మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కార్మికులపై ఉపయోగిస్తున్న ప్రమాదకర నిర్ణయాలను ఉపసంహరించుకొని, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి విధానాల కారణంగా ప్రజా రవాణా రంగాలు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయని, కార్మికుల జీవనోపాధిని రక్షించడానికి కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటానికి సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, మహాలక్ష్మి స్కీం ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు నెలకు 4500 రూపాయలు ఇవ్వాలని, పోర్టర్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సహకార యాప్ ను వెంటనే అమలు చేయాలని, కార్మికులకు ఉపయోగపడే విధంగా మోటార్ వాహన చట్టం 2019ని సవరించాలని, ఈఎస్ఐ పీఎఫ్




చట్టాలను సవరించి రోడ్డు రవాణా కార్మికులందరికీ వర్తించేలా చేయాలని, ప్రమాద భీమా 10 లక్షలు ఇవ్వాలని, జాతీయ రహదారులపై డ్రైవర్లకు అన్ని సౌకర్యాలతో రోడ్డు పక్కన వసతి సౌకర్యాలు కల్పించాలని, పెట్రోల్ డీజిల్ ధరలు టోల్ చార్జీలను తగ్గించాలని, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల దోపిడీన్ అరికట్టాలని, జాతీయ బ్యాంకుల ద్వారా చిన్నవాహన యజమానులకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ దేశవ్యాప్త సమ్మెలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బోయినపల్లి వీరబాబు, సిఐటియు మండల కన్వీనర్ గుగులోతు నరేష్, సిపిఎం డివిజన్ కమిటీ సభ్యులు తెల్లాకుల శ్రీనివాసరావు, మండల మాజీ వైస్ ఎంపీపీ గుగులోతు రమేష్, సిపిఎం నాయకులు బిల్లా విశ్వనాథం, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు షేక్ ఖాదర్ బాబా (బుజ్జి), వ్యవసాయ కార్మిక సంఘం మదిర డివిజన్ నాయకులు బంధం శ్రీనివాసరావు, అంగన్వాడీల జిల్లా కోశాధికారి రాయల విజయలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు బానోత్ ఉష, బండి జయమ్మ, సత్తు పాటి రాణి , మిరియాల రమాదేవి, టి ఆలిస్, సునీత, రత్నకుమారి, ఆశా వర్కర్లు రావణ సరోజినీ, గద్దె తులసి, గంగుల విజయలక్ష్మి, మరీదు లీలా కుమారి, భవన నిర్మాణ రంగం మండల నాయకులు గుంటి శ్రీను, పరస గాని శ్రీను, భవన నిర్మాణ కార్మికులు పటాన్ చిన్న సైదా తదితర గ్రామాల నుంచి ఆశా కార్యకర్తలు, అంగన్వాడి టీచర్లు, భవన నిర్మాణ కార్మికులు వివిధ కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రిడేషన్ ఉన్నవారికి మాత్రమే కౌంటింగ్ హాల్ లోకి అనుమతి

### వైరా మున్సిపల్ కమీషనర్ యు గురులింగం



వైరా(జర్నలిస్ట్ఫైల్): వైరా మున్సిపాలిటీ రెండవ సాధారణ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిసాయని అందుకు సహకరించిన అధికారులు, సిబ్బంది, పోలీస్ అధికారులకు మున్సిపల్ కమీషనర్ యు గురులింగం ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం జరగనున్న ఎన్నికల లెక్కింపు స్థానిక పశువైద్యశాల ఉన్న రైతు శిక్షణా కేంద్రం లో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఫలితాలను ,అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు మీడియా పాయింట్ వద్ద ఎల్ ఈ డి స్క్రీన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా జర్నలిస్టులు అక్రిడేషన్ కార్డు ఉన్నవారిని మాత్రమే కౌంటింగ్ హాల్ లోకి అనుమతి ఇస్తామని కమీషనర్ స్పష్టం చేశారు. మొత్తం 20 వార్డుల లెక్కింపు రెండు రౌండ్లలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. 1నుండి 10 వ వార్డు వరకు మొదటి రౌండ్ ,11నుండి 20 వ వార్డు వరకు రెండవ రౌండ్ గా ఉంటుందని తెలిపారు. మొత్తం 10 టేబుల్స్ ఏర్పాటు చేశామని, ఒక్కో టేబుల్ కు రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి,సూపర్వైజర్,మరొకరు నలుగురు ఉంటారని కమీషనర్ తెలిపారు. కౌంటింగ్ ప్రతి టేబుల్ కు సి సి కెమేరాలు ,స్ట్రాంగ్ రూమ్ కు మూడు సి సి కెమేరాలు అమర్చినట్లు మొత్తం 18సి సి కెమేరాలు అమర్చినట్లు ఆయన తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లు చేయాలని వైరా ఎస్ ఐ రామారావు ను కోరినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థి,అతని ఏజెంట్ ఇద్దరు మాత్రమే రిటర్నింగ్ అధికారి నుండి పొందిన ఐ డి కార్డు ద్వారా మాత్రమే లోపలకు రావాల్సి ఉంటుందని కమీషనర్ తెలిపారు.

## వాహనదారులు నిబంధనలు పాటించాలి



కాకినాడ జిల్లా, జగ్గంపేట ఫిబ్రవరి 13 (జర్నలిస్ట్ ఫైల్) : కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం జగ్గంపేట లో వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని జగ్గంపేట ఎస్సై టి.రఘునాధరావు సూచించారు. గురువారం జగ్గంపేట సెంటర్ లో ఎస్సై రఘునాధరావు తన సిబ్బంది తో వాహనాలు తనిఖీ నిర్వహించారు. నిబంధనలు పాటించని పలువురికి జరిమానాలు విధించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో వెళ్లే డ్రైవర్లు సీటు బెల్టు ధరించాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## గురుకుల కళాశాల విద్యార్థుల ప్రతిభ

### బాల్ బ్యాట్మెంటన్ క్రీడలో రాష్ట్ర స్థాయిలో ఎంపిక





బోనకల్, ఫిబ్రవరి 13 (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం పట్టణంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన సీఎం కప్ క్రీడల్లో బాల్ బ్యాడ్మింటన్ లో మధిర నియోజక వర్గం బోనకల్ మండల కేంద్రంలో సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల కళాశాల, పాఠశాల విద్యార్థులు అండర్ 17 అండర్ 19 విభాగం లో అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించడంతోపాటు రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి, పిటి కళా సంధ్య ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందించారు. అత్యంత ప్రతిభ కనబరిచిన మధులత, మనీషా, ఆకాంక్ష, రాజేశ్వరి లను ప్రత్యేకంగా అభినందించారు.

## ఘనంగా సమ్మక్క సారక్క జాతర



ఏన్కూర్, ఫిబ్రవరి 13 (జర్నలిస్ట్ ఫైల్): ఏన్కూర్ మండల పరిధిలోని తిమ్మారావుపేట గ్రామంలో ప్రసిద్ధి చెందిన సమ్మక్క సారక్క జాతర భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి కి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పుల వాయిద్యాలతో కళారూపాల ప్రదర్శనలతో ప్రాంగణమంతా మారు మ్రోగింది. భక్తుల రద్దీ పెరగడంతో గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. తెలంగాణ మెడికల్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ బొర్ర తిరపయ్య జాతర సందర్శించి సమ్మక్క సారక్క వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.



# పల్నాడులో మొక్కజొన్న సాగుకు నీళ్ళివ్వండి



○ అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే డా. చదలవాడ

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** నరసరావుపేట నియోజకవర్గంలో మొక్కజొన్న పంటలకు నీళ్లు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సాగర్ కాల్వల ద్వారా సాగునీరు అందించాలని అసెంబ్లీలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అ-రవింద బాబు గళమెత్తారు. రైతుల ఆక్రోశాన్ని ప్రజా ప్రతినిధిగా సమర్థవంతంగా వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక నియోజకవర్గ సమస్య కాదు. పల్నాడు జిల్లా మొత్తం రైతు సమాజాన్ని కలిచివేస్తున్న నీటి సంక్షోభానికి ప్రతీక.

**పల్నాడులో మొక్కజొన్న సాగు**

వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక రైతు సంఘాలు అందించిన గణాంకాల ప్రకారం. 2025-26 వ్యవసాయ సీజన్‌లో (రబీ) పల్నాడు జిల్లాలో సుమారు 1.05 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. గత సంవత్సరం (2024-25) ఇది సుమారు 75,000 ఎకరాలు మాత్రమే. అంటే 40 శాతం పెరిగింది. ఇక వరి సాగు విషయానికి వస్తే ఈ సీజన్‌లో జిల్లాలో వరి సాగు విస్తీర్ణం సుమారు 85,000 ఎకరాలు (ఖరీఫ్, రబీ కలిపి అంచనా). గత సంవత్సరం ఇది 1.05 లక్షల ఎకరాలు. అంటే 20 శాతం తగ్గింది. ఈ మార్పు సాధారణం కాదు. ఇది రైతుల వ్యూహాత్మక నిర్ణయం.

పల్నాడు రైతులు ముఖ్యంగా నరసరావుపేట, రొంపిచర్ల, సత్తెనపల్లి, వెల్దుర్తి, మాచర్ల, కారంపూడి, దుర్గి, బొల్లాపల్లి, గురజాల మండలాల్లో మొక్కజొన్నను 'బీమా పంట'గా చూస్తున్నారు. వరి పంటకు ప్రత్యామ్నాయంగా చూస్తున్నారు. మొక్కజొన్నను అతి తక్కువ నీటితో సాగు చేయవచ్చు. వరికి ఎకరాకు 20-25 తడులు (కంటిన్యూస్ వాటర్) కావాలి. మొక్కజొన్నకు 5-6 తడులు సరిపోతుంది.

తక్కువ ఖర్చుతో మొక్కజొన్న సాగు చేయవచ్చు. నరసరావుపేట, రొంపిచర్ల మండలాల్లో రైతులు భారీగా మొక్కజొన్న వేశారు. కానీ సాగర్ కుడి కాల్వ సకాలంలో నీరు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. రైతులు రోడ్డెక్కి నిరసన చేస్తున్నారు. స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అసెంబ్లీలో ప్రస్తావించారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. సాగర్ నీటిని సకాలంలో విడుదల చేసి, రైతులను కాపాడాలి.

# ట్రాక్టర్ కిందపడి వ్యక్తి మృతి

**బ్రహ్మంగారి మఠం(జర్నలిస్ట్ ఫైల్) :** బ్రహ్మంగారిమఠం మండలంలోని గంగిరెడ్డి పల్లె గ్రామం సమీపము వద్ద నరసన్న పల్లె గ్రామానికి చెందిన కొండ్రెడ్డి ప్రతాపరెడ్డి అనే యువకుడు పొలం పనుల కోసం డ్రిప్పు పైపును ట్రాక్టర్ లో పొలం వద్దకు తీసుకెళుతున్న సమయంలో ట్రాక్టర్ లో కూర్చుని ప్రయాణిస్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పడంతో అతను క్రింద పడిపోగా ట్రాక్టర్ వెనుకగాను తలపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు విషయం తెలుసుకున్న బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని ఆవేదన వ్యక్తం చేశారు దీనితో నరసన్న పల్లె గ్రామంలో విషాదఛాయలు చోటుచేసుకున్నాయి.

# నేటి నుండి బ్రహ్మంగారి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ )** కాలజ్ఞాన ప్రబోధ కర్త శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ ల కళ్యాణ మహోత్సవాలు ఈనెల 14 నుంచి 18 వరకు బ్రహ్మంగారిమఠంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. నూతన మఠాధిపతి వెంకటాద్రి స్వామి ఆధ్వర్యంలో మేనేజర్ ఈశ్వర చారి ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. 14 న ఉదయం 6 గంటలకు వీరబ్రహ్మ సుప్రభాతం నామ సంకీర్తనం ఉపనిషత్ పారాయణం 8 గంటలకు అభిషేకం సహస్రనామార్చన 12 గంటలకు మఠాధిపతుల మూలపురుషులు శ్రీ పెద్ద గోవింద స్వాములు వారి ప్రథమ పుత్రుడు గోవిందస్వామి వారి ధర్మపత్ని వీర పాపమాంబ వా నాలుగు గంటలకు హరికథ రాత్రి 8 గంటలకు కలశ ఉత్సవం 10 గంటలకి శేష వాహనోత్సవం 15న మహాశివరాత్రి సందర్భంగా 6 గం. లకి ఉదయం వీరబ్రహ్మ సుప్రభాతం 12 గంటలకి దీక్ష బంధనాలంకరోత్సవం సాయంత్రం నాలుగు గంటలకి సంగీత విభావరి గుడి ఉత్సవం 6 గంటలకు ఉపన్యాసం రాత్రి 9 గంటలకు పెద్దపుత్త గ్రామ ఉభయ దాక వచ్చి గోవింద మామ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణోత్సవం ఈ కళ్యాణమును నూతన మఠాధిపతి వెంకటాద్రి స్వామి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. 11 గంటలకి నరనంది ఉత్సవం 12 గంటలకు లింగోద్భవ కాలమున ఏకాదశ రుద్రాభిషేకం 16న ఉదయం సుప్రభాతం నామ సంకీర్తనం 10 గంటలకు మోహిని అలంకరణ ఉత్సవం 12 గంటలకు నామ సంకీర్తన భజన రాత్రి 7 గంటలకు హరికథా కాలక్షేపం రాత్రి 8 గంటలకు నంది ఉత్సవం 17 న 6 గంటలకి 7 గం. లకి సుప్రభాతం అభిషేకం 10 గంటలకు నిత్య హోమం వాస్తు హోమం బలిహరణ గజోత్సవం మధ్యాహ్నం 12 గంటలకు మహా ప్రసాద వినియోగం రాత్రి 9 గంటలకు పుష్ప రథోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మహోత్సవాలకు చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ గా శంకర్ బాలాజీ నియమితులయ్యారు

# గవర్నర్ ప్రసంగం ప్రభుత్వ బాధ్యతకు ప్రతిరూపం : ఎమ్మెల్యే గళ్లా మాధవి

○ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గవర్నర్ ప్రసంగం కేవలం ఒక సాంప్రదాయం మాత్రమే కాకుండా ప్రభుత్వ బాధ్యతకు ప్రతిరూపమని, కోట్లాది ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్లా మాధవి ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగంలో గత అనుభవాలు, నేటి విజయాలు, భవిష్యత్తు ప్రణాళికలను సమగ్రంగా ప్రతిబింబించారని, గత పాలకుల విధానాల వల్ల ఏర్పడిన దుష్పరిణామాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని, ఒక యుద్ధం ఒక రాజ్యాన్ని ఎంతకాలం ప్రభావితం చేస్తుందో, అలానే గత విధ్వంసం కూడా రాష్ట్రాన్ని ప్రభావితం చేసిందని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. అయితే నేడు ఆ విధ్వంసాన్ని అధిగమిస్తూ కుప్పకూలిపోయిన వ్యవస్థలను పునర్నిర్మాణం చేస్తూ రాష్ట్రం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. గత రెండు సంవత్సరాల్లో సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమన్వయంగా అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం శాఖల వారీగా సంస్కరణలు చేపడుతోందని ఎమ్మెల్యే గళ్లా మాధవి వివరించారు. ఆర్థిక, విద్య, ఐటి, వైద్య, వ్యవసాయం, విద్యుత్, నీటిపారుదల, పంచాయితీరాజ్, హోం శాఖలలో అమలు చేస్తున్న కార్యక్రమాలు అద్భుత ఫలితాలను ఇస్తున్నాయని చెప్పారు. ఈ పాలన శైలి మహా సామ్రాట్ శ్రీకృష్ణదేవరాయల పాలనను స్మరింప జేస్తోందని, రాష్ట్ర భవిష్యత్తును రూపకల్పన చేసే దిశగా డేటా సెంటర్, ఏఐ సిటీ, డ్రోన్ సిటీ, స్టార్టప్ వ్యాలీ వంటి ప్రణాళికలు అమలు అవుతున్నాయని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. ఇవి అమరావతి క్యాపిటల్ రీజియన్‌ను ప్రపంచ స్థాయిలో నిలబెట్టేలా చేస్తాయని, రాష్ట్రాన్ని దూరదృష్టితో ముందుకు తీసుకువెళ్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. ఆ ఆలోచనలకు రెట్టింపు శక్తిని అందిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారిని అభినందించారు. రాష్ట్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాష్ట్ర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన విశాఖ ఉత్సవ్, యోగాంధ్రా 2025, సారస్ మేళా వంటి కార్యక్రమాలు రాష్ట్ర ప్రతిష్ఠను పెంచాయని ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను, యువతలో రాజకీయాల పట్ల మరియు పరిపాలన పట్ల గౌరవాన్ని పెంపొందిస్తున్నాయని, ఇలాంటి నిర్మాణాత్మక ప్రభుత్వంలో భాగస్వామ్యం కావడం తనకు గర్వకారణమని పేర్కొంటూ, గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలపడానికి అవకాశం కల్పించిన సభాపతికి కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థులతో మాట్లాడి... మధ్యాహ్నం భోజనం కలసి చేసి..



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** చేబ్రోలు మండల కేంద్రంలో సూర్య దేవర నరసయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరుగా పదవ తరగతి గదిలోకి ప్రవేశించారు. మార్చి 16వ తేదీ నుండి ప్రారంభం కానున్న పరీక్షలకు సన్నద్ధను గురించి విద్యార్థులకు అడిగారు. అంతా సిద్ధంగా ఉన్నామని ఉత్సాహంగా సమాధానం చెప్పారు. పరీక్షలు అంటే ఎవరికీ భయం లేదా ? అని అడిగారు. భయం లేదు... పరీక్షలు రాయుటకు సిద్ధంగా ఉన్నామని మరోసారి స్పందిస్తూ చెప్పారు. భవిష్యత్తు లక్ష్యాలు నిర్దేశించుకున్నారా ? ఎవరు ఏమి కావాలని అనుకుంటున్నారు ? అని ప్రశ్నించారు. కొంత మంది ఐ.ఏ.ఎస్, కొంత మంది డాక్టర్లు, టీచర్లు అంటూ సమాధానం ఇచ్చారు.

జీవితానికి మొదటి సోపానం పదవ తరగతి అని జిల్లా కలెక్టర్ అన్నారు. "అందరూ బాగా చదువుతున్నారు. అందరూ ఉత్తీర్ణత సాధిస్తారు. రాష్ట్రంలో మనమే టాప్ రాంక్ లో నిలవాలి" అంటూ ప్రేరేపించారు. పరీక్షలను ప్రశాంతంగా రాయాలని, ఎట్టి ఒత్తిడికి గురి కావద్దని అన్నారు. మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, గురువులకు బహుమతిగా ఇవ్వండి అంటూ పిలుపునిచ్చారు. అదే ప్రాంగణంలో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలను తనిఖీ చేసి పరీక్షల సంసిద్ధత, ఏర్పాట్లు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద పంపిణీ చేస్తున్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి తిన్నారు. నాణ్యత, రుచిని కలెక్టర్ పరిశీలించారు. రోజువారి నాణ్యత, రుచి, శుభ్రతను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అందరూ రోజు మధ్యాహ్న భోజనం తింటున్నారా ? లేదా అని అడిగారు. అందరూ తింటున్నారని, భోజనం సంతృప్తికరంగా ఉందని విద్యార్థులు తెలిపారు.

**ప్రాథమిక పాఠశాల సందర్శన**

చేబ్రోలులోనే ఉన్న ప్రాథమిక పాఠశాలను కూడా తనిఖీ చేశారు. నాలుగు, ఐదు తరగతులు చదువుతున్న పిల్లల్లో అభ్యసన స్థాయిలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల చుట్టుప్రక్కల పరిశుభ్రత మెరుగుపరచాలని సూచించారు. అంతకముందు నారా కోడూరు గ్రామంలో మైక్రో ఇరిగేషన్ క్రింద నిర్వహిస్తున్న షెడ్ ను, యూనిట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి డా. షేక్ సలీం భాషా, తహసిల్దార్ శర్మ, స్థానికులు మయిలా రాజు తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మంగారి మఠాన్ని పుణ్యక్షేత్రంగా పర్యాటక రంగంగా అభివృద్ధి చేయాలి

○ సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠం మండల కేంద్రాన్ని పుణ్యక్షేత్రంగా పర్యాటక రంగంగ అభివృద్ధి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బ్రహ్మంగారిమఠంలోని సుందరయ్య భవన్ నందు పార్టీ మండల కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. శివకుమార్ వి. అన్వేష్ లతో కలిసి వారు మాట్లాడుతూ భూత భవిష్యత్తు వర్తమాన కాలాలను ప్రజలకు వివరించి కులమతాలకు అ-తీతంగా మూఢాచారాలకు వ్యతిరేకంగా కాలం మార్పును చూపిన జ్ఞాని కులం గోడలు కూల్చినయోగి వీరబ్రహ్మం గారని ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన గొప్ప సంఘసంస్కర్త శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మం గారని వారు కొనియాడారు. అటువంటి మహాజ్ఞాని సజీవ సమాధి వహించిన గొప్ప క్షేత్రం బ్రహ్మంగారిమఠం ఇటువంటి క్షేత్రం ఆధ్యాత్మిక కేంద్రంగానే కాక పర్యాటక రంగంగా కూడా అభివృద్ధి కావడానికి అనేక అంశాలు తోడ్పడనున్నాయని అయినప్పటికీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా జరగవలసినంత అభివృద్ధి ఈ ప్రాంతంలో జరగలేదని వారు ఆవేదన వెళ్ళబుచ్చారు. బ్రహ్మంగారి మఠం ఈశ్వరిదేవి దేవస్థానం రామాలయం పోలేరమ్మగుడి బ్రహ్మం గారి నివాసం, రచ్చ బండ, బ్రహ్మ సాగర్ రిజర్వాయర్ ఈశ్వరి దేవి గృహ సిద్దయ్య గారి మఠం తో పాటు మండల కేంద్రాన్ని అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయటంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని అందువల్ల అనేక పుణ్యక్షేత్రాలు అభివృద్ధిలో వెళుతూ ఉంటే బ్రహ్మంగారిమఠం ఆ దిశగా వెళ్లటం లేదని వారు ఆవేదన వెళ్ళబుచ్చారు. ప్రస్తుత ఎమ్మెల్యే అభివృద్ధి కోసం ప్రయత్నం చేస్తున్నట్లు పత్రికల్లో కనిపిస్తుందని అది వార్తలకే పరిమితం కాక ఆచరణలో కళ్ళముందు కనిపించాలని ఎమ్మెల్యే సొంత మండల కేంద్రం అయినందున ప్రత్యేక చొరవచూపి సాధ్యమైనంత త్వరగా అభివృద్ధికి బాటలు వేయాలని వారు విజ్ఞప్తి చేశారు. మఠాధిపతులు శ్రీ వెంకటాద్రి స్వాముల వారు అధికారులు ప్రభుత్వంతో సమన్వయం చేసుకొని మఠాన్ని అభివృద్ధి చేయటంలో తనదైన ముద్ర వేయాలని వారు ఆకాంక్షించారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్, మండల కమిటీ సభ్యులు అజయ్ కుమార్, రవణమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, స్థానిక నాయకులు రాహుల్, గురు బ్రహ్మాచారి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో వార్డుల వారీగా సమస్యలు పరిష్కరించాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలో వార్డ్ ల వారీగా స్థానిక సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం శాంతి నగర్, ఏటి అగ్రహారం, చుట్టగుంట సెంటర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి వార్డ్ సచివాలయం పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతి కార్యదర్శి సమగ్ర అవగాహన కల్గి ఉండాలన్నారు. శాంతి నగర్ లో దీర్ఘకాలంగా ప్రజలు డ్రైనేజి సమస్యపై ఫిర్యాదులు చేస్తున్నారని, సదరు సమస్య పరిష్కారానికి ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సంయుక్తంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లో వర్షం వచ్చినప్పుడు నీరు ఎక్కువ సమయం నిలుస్తుందన్నఫిర్యాదుపై డ్రైన్లలో పూడికతీత ఎప్పటికప్పుడు తొలగించాలని ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఏటి అగ్రహారం మెయిన్ రోడ్ లో ప్రజారోగ్య కార్మికులతో మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి తడి పొడిగా చెత్త సేకరణ ఇచ్చేలా అవగాహన కల్గించాలన్నారు. జివిబిలు పడకుండా ప్రతి ఇంటి నుండి నూరు శాతం చెత్త సేకరణ చేయాలన్నారు. మెయిన్ రోడ్లపై స్వీపింగ్ చేసేప్పుడు జాగ్రతగా ఉండాలని, ట్రాఫిక్ తక్కువగా ఉండే ఉదయం 7 గంటలలోపు పూర్తి చేయాలన్నారు. పర్యటనలో డిఈఈ వెంకటరమణ, ఎస్ఎస్ రాజేష్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# నారా లోకేశ్ చిత్రపటానికి క్షీరాభిషేకం



○ ఫీజు రీయింబర్స్ బకాయిలు విడుదలపై సర్వత్రా హర్షం

○ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆదేశాలతో టీఎన్ఎస్ఎఫ్, కూటమి నేతల వేడుకలు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** విద్యార్థులకు ఉపశమనం కలిగించేలా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కు కూటమి నాయకులు, తల్లిదండ్రులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1200 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయడంపై గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆదేశాల మేరకు టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, కూటమి నేతలు శుక్రవారం సాయంత్రం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువ నాయకులు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కూటమి నేతలు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడంతో నిరుపేద విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కల్పించినట్లు చెప్పారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఇది పెద్ద ఊరటనిచ్చే చర్యగా అభివర్ణిస్తుంచారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా రంగానికి ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు. టీచర్స్, పేరెంట్స్ మీటింగ్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాల మదింపు చేపట్టడం దేశంలోనే గొప్ప విషయమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మకమైన విద్యా విధానాలు చేపట్టారని, ఇవి మంచి ఫలితాలు ఇస్తున్నాయని వెల్లడించారు.

# వినుకొండలో ఘనంగా కృతజ్ఞత ర్యాలీ



○ నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం

**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన 1200 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేస్తూ మంత్రి నారా లోకేష్ తీసుకున్న నిర్ణయంపై వినుకొండలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు, వినుకొండ నియోజకవర్గ తెలుగు యువత మరియు టిఎన్ఎస్ఎఫ్ (ఎచీూఖీ) ఆధ్వర్యంలో భారీ కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ నుండి స్తూపం వరకు కొనసాగిన ఈ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ కృతజ్ఞతలు చాటుకున్నారు. విద్యా వ్యవస్థను గాడిలో పెడుతూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం బకాయిలు విడుదల చేసిన లోకేష్ కి ఈ సందర్భంగా నాయకులు ధన్యవాదాలు తెలిపారు. తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మెరుగైన సాగునీటి విధానమే ప్రభుత్వ లక్ష్యం



○ ప్రాజెక్ట్ కమిటి చైర్మన్ పి. మురళీధరరావు

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** కృష్ణ పశ్చిమ డెల్టా ఆయకట్టులోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించే లక్ష్యంతొ ఈసీజన్ లొ ఎదురైన సమస్యలను అధిగమించే కార్యాచరణకు తగు ప్రాధాన్యం కల్పిస్తామని, మెరుగైన సాగునీటి విధానమే ప్రభుత్వ లక్ష్యమని ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పి మురళీధర్ రావు పేర్కొన్నారు. కృష్ణ పశ్చిమ డేటా ఇరిగేషన్ కార్యాలయంలో శుక్రవారం ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పి మురళీధరరావు అధ్యక్షతన కమిటీ సమావేశం. నిర్వహించారు. డిసి లు, నీటిసంఘాల సభ్యులు పాల్గొన్న సమావేశంలొ సాగునీటి సరఫరాకు గడచిన ఖరీఫ్ సీజన్లో ఎదురైన సమస్యలను గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం 1300 పనులకు గాను, 60 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయగా, పంట కాలువల అభివృద్ధి పనులు చేపట్టారు. రాబోయే సీజన్ కు సాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, చేపట్టాల్సిన పనులపై, క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నట్లు, ఇరిగేషన్ ఎస్సీ వెంకటరత్నం సభ్యులకు వివరించారు. కాలువలు కట్టేసాక, వేసవి కాలం, చేపట్టాల్సిన పనులకు అంచనాలు వేసి, ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. సమావేశం అనంతరం ఇరిగేషన్ ఎస్సీ వెంకటరత్నం మీడియాతో మాట్లాడుతూ కృష్ణ పశ్చిమ డెల్టాకు మొత్తం ఆరు లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని, 150, సాగునీటి చెరువులు ఉన్నట్లు తెలిపారు. సమావేశం ముఖ్య ఉద్దేశం, చేపట్టాల్సిన పనులపై, అంచనాలు తయారు చేసి, ప్రభుత్వానికి పంపడమేనని అన్నారు. సమావేశంలొ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ సునీల్, డిసీలు నీటి సంఘాల సభ్యులు, పాల్గొన్నారు.

# మాజీ మంత్రికి పీఠాధిపతి పట్టాభిషేకానికి ఆహ్వానం



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** భూత భవిష్యత్తు వర్తమాన కాలజ్ఞాన స్వరూపి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం 12 వ మఠాధిపతిగా వీర ధర్మజ వెంకటాద్రి స్వామి పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఆ పట్టాభిషేక ఆహ్వాన పత్రికను ఖాజీపేటలోని మాజీ మంత్రి డి.ఎల్.రవీంద్రారెడ్డి గారి నివాసంలో మఠాధిపతి సోదరుడు శ్రీ దత్తాత్రేయ స్వామి ఆయనను కలిసి ఈనెల 26న శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం నూతన మఠాధిపతి శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాములవారి పట్టాభిషేకం జరిగే కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వాన పత్రికను అందజేశారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# జనాభా లెక్కల ఫార్మేట్‌లో ఓబీసీ కాలమ్ జేర్చి సమగ్ర కులగణన జరపాలి

○ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులుకేసన శంకరరావు డిమాండ్

○ ఢిల్లీలో మంత్రులు, పలువురి ఎంపీలను కలిసిన కేసన బృందం

○ లోపాలు లేకుండా సమగ్ర కుల గణన చేపట్టాలి

○ అన్ని అంశాలను పరిగణలోకి తీసుకోవాలి

○ సమస్యని పలువురు బీసీ నేతలకు వివరించిన బృందం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జనాభా లెక్కల సేకరణ ఫార్మేట్ లో పొందుపరిచిన 33 ప్రశ్నావళిలోని 12వ ప్రశ్నను పరిశీలిస్తే, కుటుంబ పెద్ద ఎస్సీ/ఎస్టీ/ఇతర వర్గం/ అని మాత్రమే ఇచ్చారని, వాటితో పాటు ఓబీసీ కాలమ్ కూడా జేర్చి సమగ్ర కులగణన చేపట్టాలంటూ, ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఎన్డీఏ కూటమికి చెందిన పలువురు పార్లమెంటు సభ్యులతో కలిసి, కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సాధికారితా శాఖామాత్యులను కలిసి ఆ మేరకు విజ్ఞాపన పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన జాతీయ మీడియా సమావేశంలో పలువురు బీసీ నాయకులు-పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ, దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న ఓబీసీల జనాభా కచ్చితంగా తేల్చేందుకు ఈసారి కేంద్రం చేపడుతున్న జనగణన ఫార్మేట్లో ప్రతి వ్యక్తి కులంతో పాటు ఓబీసీ కాలమ్ కూడా చేర్చాలన్నారు. ఇంకా వారు 1931 వరకు బ్రిటిష్ ఇండియాలో మాత్రమే జనగణనతో పాటు కులగణన సమగ్రంగా జరిగింది తప్ప, మళ్ళీ స్వతంత్ర భారతంలో ఇంతవరకు జరగలేదన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్-1 నుండి జరిపే జనగణనతో పాటు సమగ్రంగా కులగణన నిర్వహిస్తామనడం ద్వారా ఓబీసీ సంఘాల చిరకాల వాంఛ నెరవేర్చినట్లయిందన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని యావత్ భారత ఓబీసీ సమాజం హర్షిస్తూ, కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వానికి ముఖ్యంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి దేశ ప్రధాని కావడం వల్లే ఇది సాధ్యమైందని భావిస్తూ నరేంద్ర మోడీకి అన్ని ఓబీసీ సంఘాల తరపున కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తున్నామన్నారు. భారత్ ను విశ్వ గురువుగా ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు కృషిచేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, దేశంలోని ఓబీసీల సమగ్రాభివృద్ధి సాధికారితలతోనే అది సాధ్యమని భావించడం సంతోషదాయకమన్నారు. కానీ జనగణన ఫార్మేట్ లో పొందుపరిచిన 33 ప్రశ్నావళిలోని 12వ ప్రశ్నలో కుటుంబ పెద్ద ఎస్సీ/ఎస్టీ/ ఇతర వర్గం అన్నారే గాని, ఆ కాలమ్ లో ఓబీసీ కాలమ్ చేర్చలేదన్నారు. అలా చేర్చక పోవడాన్ని దేశవ్యాప్త ఓబీసీ సంఘాల తో పాటు మొత్తం బీసీసమాజం తీవ్ర ఆవేదన చెందుతుందన్నారు. ప్రతి ఒక్క ఓబీసీ వ్యక్తి యొక్క కులం తో పాటు ఓ బి సి కాలమ్ లేకపోవుట వలన దేశంలోని 3,796 ఓ బి సి కులాల వారి విడివిడి జనాభా లెక్కలు గాని, ఓబిసి కులాల మొత్తం జనాభా వివరాలు ప్రభుత్వాలు తెలుసుకోలేవన్నారు. అందువలన ఓబీసీల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వాలు వివిధ పథకాలు రూపొందించి, ఆయా బీసీ కులాల వారికి వారి వారి జనాభా దామాషాల మేరకు అమలు జరపడం సాధ్యం కాదన్నారు. అందుకే అన్ని ఓబీసీ సంఘాలు ప్రశ్నావళి లోని 12వ అంశంలో ఎస్సీ/ఎస్టీ/ఓబిసి/ మైనారిటీ / ఓసీ అంటూ ఐదు సామాజిక వర్గాల జనాభా వివరాలు సమగ్రంగా సేకరించాలన్నారు. ఎందుకంటే భారతీయ కుల సమాజంలో ఒక్క భారతీయుడు పై ఏదో ఒక సామాజిక వర్గానికే చెంది ఉంటారన్నారు. కావున ఎన్డీఏ ప్రభుత్వం ఈ విషయమై పునరాలోచించి, సెన్సెస్ ఫార్మేట్ లో ఓబీసీ కాలవి సమగ్ర కుల గణన జరపాలని యావత్ భారతీయ ఓబిసి బసమాజం కోరుకుంటూ నాయకులందరూ ఏకగ్రీవంగా పునరుద్ఘాటించారు.


# డాక్టర్ రంగనాయకిని ఘనంగా సత్కరించిన ఎమ్మెల్సీ ఆలపాటి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ గుడివాడకు చెందిన దాత, సామాజిక సేవకురాలు, ప్రవాస భారతీయురాలు డాక్టర్ రంగనాయకిని గౌరవపూర్వకంగా కలసి ఘనంగా సత్కరించారు. స్వగ్రామ అభివృద్ధికి ఆమె అందిస్తున్న సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆయన ప్రశంసించారు.

గుడివాడ గ్రామంలో జన్మించి అమెరికాలో వైద్యురాలిగా స్థిరపడిన రంగనాయకి, తండ్రి స్వగ్రామంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం, బస్ షెల్టర్ నిర్మించడం, రైతుల అవసరాల కోసం కాలువపై వంతెన నిర్మాణానికి విదేశీ విరాళం అందించడం వంటి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన 100 మంది బాధితులకు విద్యుత్ పరికరాలు ఉచితంగా అందించి మానవత్వాన్ని చాటుకున్నారని చెప్పారు. ఇటీవల గ్రామంలో 25 లక్షల రూపాయలతో సామాజిక భవన నిర్మాణాన్ని పూర్తిగా భరించి పూర్తి చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో కూడా గ్రామస్తులకు ఉపయోగపడే ఏ పనికైనా సహాయం చేస్తానని రంగనాయకి ఇచ్చిన భరోసా గ్రామాభివృద్ధికి దోహదపడుతుందని ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

# అమరావతిలో హజ్ హౌస్ నిర్మించండి



- 5 ఎకరాల స్థలంతోపాటు నిధులు కేటాయించండి
- ఆటోనగర్ లో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు సహకరించండి
- సీఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- సానుకూలంగా స్పందించిన సీఎం నారా చంద్రబాబు నాయుడు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** రాజధాని అమరావతి ప్రాంతంలో హజ్ హౌస్ నిర్మాణంతోపాటు ఇస్లామిక్ అకడమిక్ సెంటర్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ విన్నవించారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల అనంతరం సీఎం నారా చంద్రబాబునాయుడును ఎమ్మెల్యే నసీర్ కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు తూర్పు నియోజకవర్గం అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలుపుతూ మరింత ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు. అనంతరం రాష్ట్రంలో ముస్లింల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని వీటి పట్ల ముస్లిం మైనారిటీలు సంతోషంగా ఉన్నారని వివరించారు.

అమరావతి రాజధాని ప్రాంతంలో హజ్ హౌస్ నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలం కేటాయిస్తూ నిధులు విడుదల చేస్తే ముస్లిం సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. గన్నవరం నుంచి హజ్ యాత్రికులు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సౌదీలో పరిస్థితులపై హజ్ యాత్రికులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని విన్నవించారు.

దీంతోపాటు గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ఆటోనగర్లో అన్న క్యాంటీన్ ఏర్పాటు విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఆటోనగర్లో కార్మికులు అధిక సంఖ్యలో ఉంటారని, వివిధ ప్రాంతాల నుంచి పనులపై ఇక్కడకు ప్రజలు వస్తుంటారని తెలిపారు. ఈ దృష్ట్యా అన్న క్యాంటీన్ ఏర్పాటు అత్యవసరమని వివరించారు. ఇప్పటికే తూర్పు నియోజకవర్గంలో రోడ్లు, డ్రెయిన్లు, ఇతర అభివృద్ధి పనులకు వందల కోట్ల నిధులు విడుదల చేస్తున్నారని, పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. తన వినతి మేరకు సీఎం నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే నసీర్ వెల్లడించారు.

# నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్‌గా లలితబాబు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్‌గా పి. లలితబాబు నియమితులయ్యారు. విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రసమావేశంలో ఈ ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ తన కార్యాలయంలో లలితబాబును అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏఎస్ రామకృష్ణ మాట్లాడుతూ, మున్సిపల్ ఉపాధ్యాయులకు 506, 507 ఉత్తర్వుల ద్వారా అంతర్ జిల్లా బదిలీలు, మున్సిపల్ ప్రధానోపాధ్యాయులకు గెజిటెడ్ హోదా వంటి కీలక ప్రయోజనాలను తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా అతి త్వరలోనే మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. హైమారావు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు పి. సాయి విశ్వనాథ్, గుంటూరు నగర అధ్యక్షుడు కెవి. రాఘవులు, ప్రధాన కార్యదర్శి టి. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు టి. రవి, జలగం రామారావు, మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎన్. వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ హయాంలో రూ.4064.59 కోట్లు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు

- వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం
- ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదు
- వాకౌట్ చేయడం వైసీపీకి ఫ్యాషన్ గా మారింది
- శాసనమండలిలో వైసీపీని నిలదీసిన నిలదీసిన మంత్రి లోకేష్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వైసీపీ హయాంలో రూ. 4064.59 కోట్లు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఉన్నాయి. వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదు. వాకౌట్ చేయడం వైసీపీకి ఫ్యాషన్ గా మారిందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నిలదీశారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలపై శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. ముందుగా మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ.. విపక్ష నేత బొత్స సత్యనారాయణ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు అన్న కాంటీన్లు మూసివేయబోమని సభలో చెప్పి మాటతప్పారని, ఇప్పుడు వైసీపీ పాలనలో ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు లేవంటూ నీతులు చెబుతున్నారని ఎత్తిచూపారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ.. మండలి వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు లేవని చెబుతున్నారు. 2020- 2021 ఏడాది క్యూ-4 పెండింగ్ 683.1 కోట్లు, 2023-24 క్యూ-2, క్యూ-3, క్యూ-4 బకాయిలు 1753.98 కోట్లు, 2023-24 ఏడాది గమనిస్తే.. ఎంటీఎఫ్ ఎరియర్లు కానీ చూస్తే సుమారు రూ. 895 కోట్లు బకాయిలు పెట్టారు. వైసీపీ ప్రభుత్వంలో ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించినట్లు సభ్యులు చెబుతున్నారు. ప్రభుత్వం మారే సమయంలో రూ. 645 కోట్ల బకాయిలు చెల్లించలేదు. నేను రికార్డెడ్ గా చెబుతున్నాను. విద్యాశాఖ మంత్రిగా మాట్లాడేందుకు నాకు హక్కుఉంది. వైసీపీ రూ. 4064.59 కోట్లు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెట్టి వెళ్లారు. దీనిని నేను టేబుల్ చేస్తాను. మీరు రెడీగా ఉన్నారా అని వైసీపీ సభ్యులను నిలదీశారు. దీనిపై బొత్స స్పందిస్తూ.. వైసీపీ హయాంలో రూ. 4వేల కోట్ల బకాయిలు లేవని, రెండు వాయిదాలు మాత్రమే ఉన్నాయని చెప్పారు. ఇంటర్ విద్యను పట్టించుకోవడం లేదన్నారు. ఇందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నామని చెప్పారు.

**వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం :** నిజాలు చేదుగా ఉంటాయి. వైసీపీ సభ్యులు అబద్దాలు చెప్పి బయటకు వెళ్తున్నారు. ఇంటర్ విద్యపై దృష్టి పెట్టడం లేదంటున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 70వేల మంది విద్యార్థులు పెరిగారు. అదీ ఈ ప్రభుత్వ చిత్తశుద్ధి. వైసీపీ ఐదేళ్ల కాలంలో కనీసం పుస్తకాలు బ్యాగ్స్ ఇవ్వలేదు. మధ్యాహ్న భోజనం రద్దు చేసి వెళ్లిపోయారు. ఇప్పుడు మమ్మల్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదు. మేం ఇంటర్ లో మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించాం. పుస్తకాలు ఇస్తున్నాం. 10, ఇంటర్ విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నాం. వాకౌట్ చేయడం వైసీపీకి ఫ్యాషన్. ఈ తలుపు నుంచి వెళ్తారు. హాయిగా టీ తాగి ఆ తలుపు నుంచి వస్తారు. చిత్తశుద్ధి ఉంటే మా ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. మాకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే సమాధానం ఇస్తున్నాం. సమస్యలు లేవని మేం చెప్పడం లేదు.

మేం వినేందుకు సిద్ధంగా ఉన్నాం. పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాం. గతంలో మాదిరిగా నోరు మూసివేయడానికి కాదు మేం ఇక్కడ ఉంది. మేం చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. పరదాలు కట్టుకుని మేం తిరగడం లేదు. అసెంబ్లీకి సీఎం గారు వస్తుంటే ప్రజలు నవ్వుతూ చేతులు ఊపుతున్నారు. గత సీఎం 3వేల మంది పోలీసులను పెట్టేవారు రోడ్లపైన. యుద్ధవాతావరణం ఉండేది. ఇప్పుడు ప్రశాంతంగా, హాయిగా తిరగలుగుతున్నాం. ఇదీ మా చిత్తశుద్ధి. విపక్ష నేతను పిలిపించాలి. ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదు. వైసీపీ హయాంలో 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరం అయ్యారు. ప్రశ్నించే హక్కు నాకు ఉంది. వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి చెప్పారు.

# సేవ, సంకల్పం, శక్తి... బీజేపీ మహిళా మోర్చా స్ఫూర్తి





**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయం వాజ్పేయ్ భవన్ వేదికగా జిల్లా మహిళా మోర్చా కార్యవర్గ విస్తరణలో భాగంగా నూతన కమిటీ బాధ్యతల స్వీకార కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా, జోష్‌తో జరిగింది. ఈ సమావేశం జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శనక్కాయల రాధా మాధవి అధ్యక్షతన, జిల్లా బీజేపీ అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు సమక్షంలో ఘనంగా నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ప్రకటించగానే కార్యకర్తల్లో ఉత్సాహం వెల్లివిరిసింది.

ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ, మహిళా మోర్చా పార్టీకి ప్రాణంగా నిలుస్తుందని, జిల్లావ్యాప్తంగా ప్రజా సమస్యలపై పోరాటానికి, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లడానికి ముందుండాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో మహిళా మోర్చా మరింత శక్తివంతంగా పనిచేయాలని ఆకాంక్షిస్తూ నూతన కమిటీ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నడ్డి నాగ మల్లేశ్వరి, రాష్ట్రమహిళా మోర్చా కార్యదర్శి హరి పావని, గుంటూరు మిర్చి యార్డ్ డైరెక్టర్ శ్రావణ కుమారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈదర శ్రీనివాసరెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కుమార్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణతో పాటు వివిధ మోర్చాల అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొని నూతన కమిటీకి ఘనంగా అభినందనలు తెలిపారు. నూతన జిల్లా మహిళా మోర్చా పదాధికారులుగా ఉపాధ్యక్షులు వాణి వెంకట్, సాధు వాణి, లక్ష్మీ దేవి, చాముండేశ్వరి, స్వాతి, విజయలక్ష్మి నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా కాసు శ్రీదేవి, కటారి పద్మజ ఎంపికయ్యారు. కార్యదర్శులుగా రాధికా, రమ్య, రమాదేవి, లక్ష్మీ ప్రసన్న, ఫర్హానా ఉన్నారు. కోశాధికారిగా డాక్టర్ స్రవంతి, సోషల్ మీడియా కన్వీనర్‌గా వెంకట లక్ష్మి నియమితులయ్యారు. కార్య నిర్వాహక సభ్యులుగా లీలా రాణి, ఉష, లీలా, దుర్గా, పద్మ ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు "పార్టీ బలోపేతమే లక్ష్యం" అనే నినాదంతో, మహిళల సమస్యలపై పోరాటానికి, ప్రజాసేవలో ముందుండేందుకు అంకితభావంతో పనిచేస్తామని ఉత్సాహంగా సంకల్పం వ్యక్తం చేశారు.

# శ్రీశైలభక్తసేవాసమితి సేవాదృక్పథం స్ఫూర్తిదాయకం

- డిఎస్పీ బి. జనార్ధనరావు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** మహాశివరాత్రి పర్వదిన వేళ శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వేలాదిగా తరలివచ్చే భక్తులకు విభిన్న సేవలు, పద్దెనిమిది సంవత్సరాలుగా ఓ కార్యాచరణగా నిర్వహిస్తున్న సేవా సమితి, విధానం స్ఫూర్తిదాయకమని తెనాలి డిఎస్పీ బి. జనార్ధన్ రావు పేర్కొన్నారు.

స్థానిక కోతపేటలోని దేవిప్రియ ఫంక్షన్ హాల్ సెంటర్ నందు, శుక్రవారం శ్రీశైల భక్త సేవా సమితి ఆధ్వర్యంలో, మహాశివరాత్రి వేళ, శ్రీశైలంలో భక్తుల, అన్నదాన సేవకు,సిద్ధం చేసిన బియ్యం, కిరాణా సరుకులు, వాటర్ బాటిల్స్, కూరగాయలు, వైద్యశిబిరం నిర్వాహణకు మందులు,ఐదు లారీలలో శ్రీశైలం బయలు దేరుటకు, సిద్ధం కాగా,ఆత్మీయ అథిధిగా పాల్గొన్న, డిఎస్పి బీ జనార్ధన్ రావు, సరుకుల లోడ్ లారీలకు జెండా చూపించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 18 సంవత్సరాలుగా, మహాశివరాత్రి పర్వదిన వేళ, శ్రీశైల పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు, తెనాలి నుండి వెళ్లి సేవలు అందిస్తున్న, శ్రీశైల భక్త బృంద సేవ సమితి తెనాలి వారి,సేవా తత్పరత స్ఫూర్తి దాయకం అన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమంలోపాల్గొనే అవకాశం కల్పించిన నిర్వాహకులు అభినందనీయులని అన్నారు. సుమారు లక్ష మంది శివ భక్తులకు అన్నప్రసాద వితరణ, 25 వేల మంది పైగా భక్తులకు, వైద్య శిబిరం ద్వారా వైద్య సేవలు, అందించుటకు తగు ఏర్పాట్లతో బయలుదేరినట్లు శ్రీశైలం భక్త బృంద సేవాసమితి బాధ్యులు మీడియాకు వివరించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కార్యదర్శి పరిమి గోవర్ధన్ , కోశాధికారి కోన బ్రహ్మానందం, వెంపటి రవీంద్ర, గట్టానాగ సుధాకర్, భాస్కర్, తుమ్మల శివరామకృష్ణ తదితర సభ్యులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల భవిష్యత్‌కు భరోసా కావాలి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం ఉద్యోగులకు తీవ్ర అన్యాయంగా మారిందని, దీనిపై అసెంబ్లీ సమావేశాల్లో తక్షణమే ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సేవల సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి చాంద్ బాష డిమాండ్ చేశారు. 2004 సెప్టెంబర్ 1 నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులపై అమలు చేస్తున్న ఈ విధానం వల్ల వారి భవిష్యత్ భద్రత ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. ఎన్నికల సమయంలో పాలకులు ఈ విధానంపై స్పష్టమైన హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం ఈ అంశాన్ని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కే. పవన్ కళ్యాణ్ ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారని గుర్తుచేశారు. ఆ హామీ అమలైతే రాష్ట్రవ్యాప్తంగా సుమారు రెండు లక్షలకు పైగా కుటుంబాలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ నిర్ణయం కోసం ఉద్యోగులు ఆశతో ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంలో ఉన్న ప్రతి ఉద్యోగికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల భవిష్యత్ భద్రత కోసం వెంటనే నిర్ణయం తీసుకుని అసెంబ్లీలో ప్రకటన చేయాలని చాంద్ బాష డిమాండ్ చేశారు.

## సెలవు రోజుల్లోను పనిచేయనున్న జిఎంసి క్యాష్ కౌంటర్లు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** 2025--26 ఆర్థిక సంవత్సరము ఆస్తి పన్ను, బకాయిలను చెల్లించుటకు వీలుగా శని, ఆదివారాల్లో శెలవు రోజులైనా కూడా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లో పన్నుచెల్లింపు కేంద్రాలు యధావిధిగా పనిచేస్తాయని బకాయిదార్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమీషనర్ కె. మయూర్ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగర ప్రజలు ఆస్తి, ఖాళీ స్థల పన్నులు మరియు నీటి పన్నులు పూర్తిగా చెల్లించి నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. శనివారం, ఆదివారం సెలవు రోజులైనప్పటికీ జిఎంసి ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంలోని క్యాష్ కౌంటర్ల యందు నగర పాలక సంస్థకు చెల్లించవలసిన పన్ను చెల్లించవచ్చన్నారు. వార్డ్ సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, అధికారులు కూడా ఉదయం నుండే పన్ను వసూళ్ల విధుల్లో ఉండాలని ఆదేశించామన్నారు. మొండి, పెద్ద బకాయిదార్ల వద్ద నుండి పన్ను వసూళ్లకు రెవెన్యూ అధికారులు, డిప్యూటీ కమిషనర్లు కూడా వెళ్లాలని ఆదేశించారు.

# చికెన్ పాక్స్ ... సత్వర వైద్య సేవలతో లేదిక చింత

- వైద్యుల సూచనలతో చిన్నారుల ఆరోగ్యం భద్రం
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలంటూ అవగాహనా కల్పిస్తున్న వైద్యులు
- కాకుమాను లో వైద్య సిబ్బంది సూచనలు
- కాకుమాను పి హెచ్ సి వైద్యధికారి డా స్వర్ణ రాజశేఖర్



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** ఫిబ్రవరి, మార్చి నెలలంటే పిల్లలకి మరో కొత్తరకం వణుకు మొదలవుతుంది. అదేనండి పరీక్షల కాలం. అయితే సరిగ్గా ఈ సీజన్ లోనే వాతావరణంలో రకరకాల వైరస్‌లు విజృంభిస్తాయి. అందులో అతి ముఖ్యమైనది చికెన్ పాక్స్( అమ్మోరు పోయడం) పిల్లల్లో బడికెళ్లే వయసువారిలో, చికెన్ పాక్స్ సంక్రమించే రిస్క్ ఎక్కువ. బడికెళ్లే పిల్లల్లో రకరకాల ఇన్ఫెక్షన్లు వస్తుంటాయి, పోతుంటాయనీ. రకరకాల పేర్లున్న చికెన్ పాక్స్ ఒక వైరల్ ఇన్ఫెక్షన్ అని కాకుమాను ప్రాథమిక వైద్యశాల వైద్యధికారి డా స్వర్ణ రాజశేఖర్ తెలిపారు. ప్రస్తుతం చిన్నారులకు చికెన్ పాక్స్ సోకే అవకాశాలు ఉంటాయని ముందస్తు జాగ్రత్తలతో వ్యాధి నీ నిరోదించి చిన్నారులను త్వరగా కోలుకునే విధంగా చేసుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా వైద్యులు డా స్వర రాజశేఖర్ సూచనలు తెలియజేస్తూ చికెన్ పాక్స్ సంక్రమించడానికి ప్రధానంగా ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తి ముక్కు, నోటి నుండి వెలువడే తుంపర్ల ద్వారా, శరీరంపై ఉన్న నీటి పొక్కుల స్రావాల ద్వారా పక్కనున్నవారికి ఈ వైరస్ వ్యాపిస్తుందన్నారు. ఎండి చెక్కుకట్టిన చర్మంవల్ల హాని లేదన్నారు.

శరీరంలో ప్రవేశించిన తర్వాత వైరస్ మొదటి 10-20 రోజుల్లో కాలేయం, ప్లీహంలోనూ, ఇంద్రియ గ్యాంగ్లియాన్స్‌లోనూ వృద్ధి చెందుతుంది. తర్వాత శరీరమంతా వ్యాపించి శ్వాసకోశానికి, చర్మానికి చేరుతుంది.

మొదటి దశ పూర్తిగా ఎటువంటి లక్షణాలూ కలిగి ఉండదు. ఈ దశలో రోగివల్ల ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెందదు.

రెండో దశ 24 – 48 గంటలు ఉండి, జ్వరం, తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, నీరసం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. జ్వరం మొదలైన రెండో – మూడో రోజున ఎర్రటి పొక్కులు ముందుగా మొహం, ఛాతీ, వీపుపై మొదలై రెండు మూడు రోజుల్లో కాళ్లు చేతులకు కూడా వ్యాపిస్తాయి.

పొక్కులు మొదట ఎర్రగా చిన్నగా ఉండి, రెండు మూడు రోజుల్లో నీటి బుడ్లలా మారి మధ్యలో చిన్న గుంట పడుతుంది. నీటి తిత్తి చుట్టూ చర్మం ఎర్రగా కమిలి ఉంటుంది. విపరీతమైన దురద కలిగివుంటాయి. కళ్లు, పెదవులు, నోటి లోపల, జననేంద్రియాలపై కూడా ఈ నీటి పొక్కులు వస్తాయి. నోటి పూత, పేగులు పొక్కటం వలన అరుచి, అజీర్తి ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి.

ఈ దద్దుర్లు వచ్చే రెండు రోజుల నుండి దద్దుర్లన్నీ అణిగిపోయి చెక్కు కట్టే వరకు రోగి నుండి వైరస్ ఇతరులకు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఈ నిడివి దాదాపు పది రోజులు ఈ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు శరీరం, చర్మం, పక్క బట్టలు శుభ్రంగా ఉంచుకోవాలి. జ్వరానికి వైద్యులు సూచించిన మోతాదులో మందులను వాడవచ్చు. పిల్లలు మరీ గోకేసుకుంటారు కాబట్టి గోర్లు కత్తిరించి, పలుచని బట్ట చేతులకు చుట్టేయాలి. తేలికగా అరిగే బలవర్ధకమైన ఆహారం తినాలి. ఇంట్లో ఒకరికి చికెన్ పాక్స్ వచ్చినప్పుడు, తీవ్ర వ్యాధి కలిగే ప్రమాదం ఉన్నవారు, ఇది వరకు ఈ వ్యాధి రానివారు రోగి దూరంగా ఉండాలి. ప్రమాద లక్షణాలపై కనీస అవగాహన కలిగి ఉండి, సత్వర వైద్యం చేయించాలి.

### జ్వరం, దద్దుర్లకు అంత జాగ్రత్తలు

అన్నివైరల్ ఇన్ఫెక్షన్లూ వాటంతట అవే తగ్గిపోతాయి. అలాగే ఇది కూడా. వారిసెల్లా ఇన్ఫెక్షన్ కొన్నిసార్లు జ్వరం, దద్దుర్లకు మించి అపాయకరం కావచ్చు. ఇందులో ప్రధానమైనది వారిసెల్లా న్యుమోనియా, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు. అరుదుగా లివర్ ఫెయిల్యూర్, మెదడువాపు లాంటి ప్రాణాంతక సమస్యలు కూడా కలగవచ్చు.

సహజ రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు,నెలల వయస్సు పిల్లలు, గర్భిణీ స్త్రీలు (మొదటి నాలుగైదు నెలల్లో చికెన్ పాక్స్ వస్తే పిండంపై దుష్ప్రభావం ఉండొచ్చు), క్యాన్సర్లు, ట్రాన్స్‌ప్లాంట్ వంటి సమస్యలకు చికిత్స పొందుతున్న వారు. హెచ్ ఐ వి రోగులు, అరుదుగా పూర్తి ఆరోగ్యవంతులు సైతం. నోటి పూత, పేగులు కూడా పొక్కడం వలన ఏది పడితే అది తినడం మంచిది కాదు. కానీ, మరీ చప్పిడిగా అవసరం లేదు. నూనె, కారం, మసాలా తగ్గించి తినడం మేలు. పాలు, పెరుగు, తాజా పండ్లు తగినంత నీరు అవసరం. లివర్ పని తీరు సరిగా లేనప్పుడు కొవ్వులు, మాంసకృత్తులు వీలైనంత తగ్గించాలి.

### గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గర్భం తొలి దశల్లో చికెన్ పాక్స్ వస్తే పిండంలో అవకరాలు ఏర్పడే అవకాశం ఉంది. గర్భిణీకి, మొదటి నాలుగు లేదా ఐదు నెలల్లో, దగ్గరవారిలో ఎవరికైనా చికెన్ పాక్స్ వచ్చి ఉంటే తక్షణం డాక్టర్‌ను సంప్రదించండి. సూచించిన వైద్యం తీసుకోండి. గర్భంతో ఉన్నవారు, గర్భం ధరించే అవకాశం ఉన్నవారు వ్యాక్సీన్ తీసుకోకూడదు. ముందు జాగ్రత్తగా యాంటీ వైరల్ మందులు వాడకూడదు.

కాన్పుకు ఐదు లేదా అంతకన్నా ఎక్కువ రోజుల ముందు చికెన్ పాక్స్ వచ్చినట్లయితే, తల్లి ద్వారా బిడ్డకు వైరస్ సంబంధిత యాంటీబాడీస్ సంక్రమిస్తాయి. కాబట్టి వ్యాధి వచ్చే అవకాశం తక్కువ.

ప్రసవానికి నాలుగు రోజుల లోపు లేదా రెండు రోజుల తర్వాత తల్లికి పాక్స్ వస్తే, నవజాత శిశువుకు యాక్టివ్ వైరల్ ఇన్ఫెక్షన్ రావచ్చు. అందులో ముఖ్యంగా వారిసెల్లా న్యుమోనియా, మెనింజైటిస్ ఇలాంటివి ప్రాణాంతకం. అటువంటి సందర్భాల్లో శిశువుకి వి ఐ జి వంటి అత్యవసర నివారణ వైద్యాలు చాలా వరకు మేలు చేస్తాయి.

ఈ సమయంలో ఆ నీటి పొక్కుల నుంచి వెలువడే వైరస్ వల్ల ఇతరులకు చికెన్ పాక్స్ రావచ్చు. బొబ్బలు తగ్గిపోయినా మంట-నొప్పి కొన్ని నెలలపాటు బాధ పెడతాయి. రోగాన్ని, దీర్ఘకాలిక ఇబ్బందుల్ని నివారించండి. ఒకవేళ చికెన్ పాక్స్ వచ్చినా వైద్యులు చెప్పిన జాగ్రత్త చర్యలు పాటించడం వలన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని తెలిపారు.

### వైద్యుల ముందస్తు జాగ్రత్త చర్యలు

కాకుమాను ప్రాథమిక వైద్యశాల కు చెందిన వైద్యధికారి డా స్వర్ణ రాజశేఖర్ తమ పరిధిలో గల ప్రజల ఆరోగ్య సంరక్షణ సమాచారం ఎపటికప్పుడు క్షేత్ర స్థాయిలో సిబ్బందిని సమన్వయము చేసుకుంటూ పర్యవేక్షస్తూ ఉంటారు. అందులో భాగంగా ఇటీవల విద్యార్థులకు చికెన్ పాక్స్ వచ్చినట్లు సమాచారం అందడంతో హుటాహుటిన విద్యార్థులకు కాకుమాను వైద్య శాలకు తీసుకువెళ్లి ముందస్తు వైద్య సేవలు అందజేశారు. తొమ్మిది మంది విద్యార్థులు రాగ ముందస్తు వైద్యంతో విద్యార్థులు పూర్తి ఆరోగ్యం గా ఉన్నారన్నారు. కొందరిని వారి తల్లితండ్రులు తీసుకోని వెళ్లగా మిగిలిన వారిని వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఐసొలేషన్ లో ఉంచి వైద్యం అందించారన్నారు.



అందరు విద్యార్థులు పూర్తి ఆరోగ్యం గా ఉన్నారని వైద్యులు తెలిపారు. తాను ఎపటికప్పుడు సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ విద్యార్థుల ఆరోగ్య జాగ్రత్తలు గురించి సమీక్షలు నిర్వహిస్తూ జిల్లా వైద్య ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలియజేసారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467